ఈనాటి
PRGI-NO-APTEL/25/A2739
# తెలుగోడు
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com

సంపుటి-1 | సంచిక -107 | గురువారం 15 జనవరి 2026 | పేజీలు - 8 | వెల - రూ.. 5

Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati






## ఉద్యోగులకు రూ 110 కోట్లు విడుదల

● పెండింగ్‌లో వున్న బకాయిల చెల్లింపు ● ఉద్యోగుల ఖాతాల్లోకి జమా
●పోలీసుల సరెండర్ లీవ్‌లు, డీఏ ఎరియర్లు విడుదల ● ఉద్యోగులతో పాటు పెన్షనర్లకూ లబ్ది

**అమరావతి (తెలుగోడు), జనవరి 14 :** ఏపీ ప్రభుత్వం పండుగ వేళ ఉద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పింది. ఇప్పటికే హామీ ఇచ్చిన విధంగా ఉద్యోగుల బకాయిలను విడుదల చేసింది. సంక్రాంతి కానుకగా ఉద్యోగుల ఖాతాల్లో బకాయిలను జమ చేసింది. ఈ మేరకు ఉద్యోగులకు బ్యాంకుల నుంచి మెసేజులు అందుతున్నాయి. సంక్రాంతి సమయంలో ఉద్యోగుల బకాయిల పైన ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఈ రోజున ఉద్యోగులకు అందాల్సిన బకాయిలు వరుసగా జమ అవుతున్నాయి. సంక్రాంతి పండుగ వేళ ఉద్యోగులకు ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తోంది. ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల బకాయిలను చెల్లించాలని సంక్రాంతి వేళ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఈ రోజు నిధులను జమ చేస్తున్నారు. పోలీసులకు రావాల్సిన సరెండర్ లీవులు, డీఏ ఎరియర్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఉద్యోగుల డీఏ కోసం ఏకంగా రూ.110 కోట్లు విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇక పోలీసులకు సరెండర్ లీవ్ చెల్లింపులు కూడా రిలీజ్ చేయనుంది. దీని ద్వారా 55 వేల మంది ఉద్యోగులు లబ్ది పొంద నున్నారు. ఇక డీఏ, ఏరియర్స్ చెల్లింపులతో 2.25 లక్షల మంది ఉద్యోగులు బెనిఫిట్ పొంద నున్నారు. అదే విధంగా 2.70 లక్షల మంది పెన్షనర్లు కూడా ఏపీ ప్రభుత్వ నిర్ణయంతో లబ్ది పొందనున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాల వల్ల మొత్తం 5.70 లక్షల మందికి ప్రయోజనం దక్కనుంది. సంక్రాంతి కానుకగా ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులకు డీఏ, డీఆర్ ఎరియర్లు, సరెండర్ లీవులతో పాటు కాంట్రాక్టర్లకు పెండింగులో ఉన్న బిల్లులు జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దాంతో భోగి పండుగ రోజు ఈ నగదు బకాయిలు చెల్లించిం ది. నగదు ఖాతాల్లో జమ కావడంతో వారంతా ఆనందంలో ఉన్నారు. డీఏ,డీఆర్ఏ (మిగతా 2లో)

### పండుగరోజున ఇదొక మంచి శుభవార్తే..



సంక్రాంతి పండుగ రోజు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మాకు మంచి శుభవార్తేనని చెప్పుకోవచ్చు. పోలీస్ శాఖతో పాటు ఇతర శాఖల ఉద్యోగుల బకాయిలు చెల్లించడం సంతోషం. రాష్ట్ర ప్రభుత్వానికి మా పోలీస్ శాఖ తరపున కృతజ్ఞతలు..

బి.మల్లికార్జున్‌రెడ్డి, ఎస్సై, ఓడిసి, శ్రీసత్యసాయి జిల్లా..

## ప్రధాని మోడీ సంక్రాంతి, మాఘబిహు శుభాకాంక్షలు



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), జనవరి 14 :** ప్రధాని మోడీ ప్రజలకు మకరసంక్రాంతి, మాఘ బిహు మరియు పొంగల్ శుభాకాంక్షలు తెలిపారు. మకర సంక్రాంతి శుభ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ.. భారతీయ సంస్కృతి - సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే నువ్వులు, బెల్లం తీపితో నిండిన ఈ పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం,శ్రేయస్సు, విజయం నింపాలని కోరారు. సూర్యుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆయన ప్రార్థించారు. అస్సాంతో పాటు ఈశాన్య రాష్ట్రాలు నేడు మాఘ బిహు పండుగను జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. పొంగల్ పర్వదినం సందర్భంగా తమిళనాడు ప్రజలకు కూడా శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ పండగ రైతులు, వారి కుటుంబాల జీవితాల్లో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. ఈ పండగ మనల్ని పోషించే వారికి కృతజ్ఞతలు తెలియజేయడం, తద్వారా మన సమాజాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రజలు ఆత్మవిశ్వాసం, ఆశావాదాన్ని కలిగివుండాలని పేర్కొన్నారు. ఈసంవత్సరం ప్రజలందరికీ శ్రేయస్సు, సానుకూలత, మంచి ఆరోగ్యం కలిగి ఉండాలని తెలిపారు.





## తెలుగు రాష్ట్రాల్లో భోగి సంబరాలు

- తెలుగు రాష్ట్రాల్లో భోగి సంబరాలు ..
- భోగిమంటలు వేసిన ఇరు రాష్ట్రాల ప్రజలు..
- భోగి వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు..
- సొంతూళ్లో సంక్రాంతి సంబరాల్లో ఏపీ సిఎం..


**అమరావతి (తెలుగోడు), జనవరి 14 :** తెలుగు రాష్ట్రాల్లో భోగి సంబరాలు మొదలయ్యాయి. వేకువజామునే భోగిమంటలు వేసి ఆనందంగా పండగను ప్రారంభించారు. హైదరాబాద్ తదితర గ్రామాల్లో ఉదయమే భోగిమంటలు వేశారు. గేటెడ్ కమ్యూనిటీల్లో పెద్ద ఎత్తున భోగి జరుపుకున్నారు. ఏపీ వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మూడు రోజుల సంక్రాంతి పండుగలో తొలిరోజు భోగి సంబరాలు వైభవంగా జరిగాయి. బుధవారం తెల్లవారుజామున ఇంటి ముంగిళ్లలో భోగి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు వేసుకుంటూ ఆటపాటలతో రాష్ట్ర ప్రజలు ఉత్సాహంగా గడిపారు . సూర్య భగవానుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే సమయాన్ని 'మకర సంక్రాంతి' అని అంటారు. ఈ పండుగకు సరిగ్గా ఒక రోజు ముందు 'భోగి' పండుగను జరుపుకుంటారు. అలాగే భోగి రోజు సాయంకాలం సమయంలో బొమ్మల కొలువును కూడా మిగతా 2లో




## కొత్త హద్దులతో మాస్టర్ ప్లాన్

- అమరావతి కేంద్రంగా కీలక నిర్ణయాలు..
- మాస్టర్ ప్లాన్ విస్తరణ కోసం సీఆర్‌డీఏ ప్రతిపాదనలు..
- రెండోదశ పూలింగ్ ప్రాంతానికి రోడ్ల విస్తరణ..
- 16వ నెంబర్ జాతీయ రహదారికి కలిపే చర్యలు..
- రాజధాని చుట్టూ 7ప్రాంతాల్లో పారిశ్రామిక, వాణిజ్య ప్రదేశాలు..

**అమరావతి (తెలుగోడు), జనవరి 14 :** అమరావతి కేంద్రంగా కీలక నిర్ణయాలు జరుగుతున్నాయి. రెండో విడత భూ సమీకరణ సమయం లోనే సీఆర్డీఏ కొత్త ప్రణాళికలు అమలు చేస్తోంది. షెడ్యూల్ ప్రకారం నిర్మాణాల ప్రక్రియను పూర్తి చేసేందుకు కసరత్తు కొనసాగుతోంది. ఇదే సమయంలో రాజధాని మాస్టర్ ప్లాన్ విస్తరణ దిశగానూ ఆలోచన జరుగుతోంది. లాండ్ పూలింగ్ విస్తీర్ణం పెరగటంతో... దీనికి అనుగుణంగా మాస్టర్ ప్లాన్ లో అవసరమని గుర్తించారు. దీంతో, కొత్త హద్దులు ఖరారు చేస్తూ మాస్టర్ ప్లాన్ విస్తరణ కోసం సీఆర్డీఏ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోందని సమాచారం. అమరావతిలో రెండో విడత లాండ్ పూలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందుకు అనుగుణంగా సీఆర్డీఏ రాజధానికి కొత్త హద్దుల మేరకు మాస్టర్ ప్లాన్ విస్తరణకు నిర్ణయించారని సమాచారం. ఈ మేరకు తుది కసరత్తు చేస్తున్నారు. రెండో విడత భూ సమీకరణ ప్రక్రియ ముగిసిన తరువాత మాస్టర్ ప్లాన్ విస్తరణకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభించనున్నారు. 189 కిలోమీటర్ల పొడవైన అమరావతి ఔటర్ రింగురోడ్డుకు



ఇప్పటికే గెజిట్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీనికితోడు ఇన్నర్ రింగురోడ్డు నిర్మాణమూ చేపట్టనున్నారు. అయితే ప్రస్తుతం ఉన్న మాస్టర్ ప్లానును విస్తరించాలనే ఆలోచనలో ఉన్నట్లు ఇటీవల మంత్రి నారాయణ వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న రోడ్లను రెండోదశ పూలింగు ప్రాంతానికి విస్తరించనున్నామని, వీటిని ఔటర్ రింగుకు అన్నివైపులా కలిపేలా ప్లానింగు ఉందని (మిగతా 2లో)

## సంక్రాంతి శోభ

కూటమి రాకతో పల్లెల్లో ప్రశాంత జీవనం..డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్



**అమరావతి (తెలుగోడు), జనవరి 14 :** తెలుగు రాష్ట్రాల్లోని పల్లెలు సంక్రాంతి శోభతో కళకళలాడుతున్నాయని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈ పండుగ అనగానే మన మదిలో మెదిలేది భోగిమంటలు, గంగిరెద్దులు, రంగవల్లులు, హరిదాసు కీర్తనలు, సంప్రదాయ పందేలు, కొత్తదుస్తులు, పిండి వంటలేనని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రాకతో ఏపీ అంతటా ప్రశాంతత వెల్లివిరుస్తోందన్న సంగతిని వేరే ప్రస్తావించవలసిన అవసరం లేనేలేదన్నారు. శాంతి, సామరస్యం ఉన్నచోట రోజూ పండుగే. ఇలాంటి తరుణంలో జరుగుతున్న ఈ సంక్రాంతితో ప్రతి ఇల్లూ సౌభాగ్యంతో విలసిల్లాలని కోరుకుంటున్నాను. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించి ఉత్తరాయణ పుణ్యాన్ని ప్రసాదించే ఈ పండుగ తెలుగువారందరికీ సర్వైశ్వర్యం ప్రసాదించాలని దేవుడిని కోరుకుంటున్నానని పవన్ పేర్కొన్నారు. (మిగతా 2లో)

## పాటలో అన్నీ నిజాలే


- ప్రతి ఏడాదీ సంక్రాంతికి ఓ కొత్తపాటతో డ్యాన్ ..
- కూటమిని టార్గెట్‌చేస్తూ పాట రూపకల్పన..
- తాను డ్యాన్స్ చేస్తే సంబరాల రాంబాబు అని పవన్ విమర్శ..
- కూటమి అన్యాయాలు 5 నిమిషాల పాటలో ..
- మాజీ మంత్రి అంబటి రాంబాబు..



**గుంటూరు (తెలుగోడు), జనవరి 14 :** గత కొన్నేళ్లుగా ప్రతీ ఏడాది సంక్రాంతి సందర్భంగా ఓ పాట రూపొందించడం, దానికి తానే స్వయంగా డ్యాన్స్ చేయడం వైఎస్సార్సీపీ నేత అంబటి రాంబాబుకు అలవాటుగా మారింది. వైసీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ ను కీర్తిస్తూ ఇలా పాటలు చేయడం ప్రారంభించిన అంబటి.. కూటమి ప్రభుత్వం వచ్చాక రూటు మార్చారు. కూటమి ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ ఆయన రూపొందించిన తాజా పాట ఇవాళ రిలీజ్ చేశారు. అంతే కాదు దీని వెనుక ఉన్న ఓ కీలక కారణాన్ని కూడా బయటపెట్టారు. ప్రభుత్వానికి కౌంటర్ గానే ఈ సంక్రాంతి పాట రూపొందించారని వచ్చిన విమర్శలపై అంబటి స్పందించారు. ఇది కౌంటర్ కాదు , ప్రభుత్వంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను ఐదు నిమిషాల పాటలో ఇమిడ్చే ప్రయత్నం చేసి సక్సెస్ అయ్యామని తెలిపారు. రెండు నెలలుగా ప్రిపేర్ చేసి ఇవాళ ప్రెజెంట్ చేశామని తెలిపారు. ఇందులో హద్దులు మీరిన విమర్శలు లేవన్నారు. పచ్చినిజాలే ఉన్నాయి, వాటిని (మిగతా 2లో)

## అర్ధరాత్రి జర్నలిస్టుల అరెస్టు దారుణం


రాష్ట్రంలో ఎమర్జెన్సీ తలపిస్తున్న కాంగ్రెస్ పాలన
అరెస్టులను ఖండించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్(తెలుగోడు), జనవరి 14 :** సంక్రాంతి పండుగవేళ జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. తెలంగాణలో ఈ కాంగ్రెస్ పాలన అనుక్షణం ఎమర్జెన్సీని గుర్తుచేస్తోందని విమర్శించారు. తెలంగాణ డీజీపీ జర్నలిస్టులను నేరస్తులలా ట్రీట్ చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. మీరు ముందుగా వారికి నోటీసులు జారీచేసి విచారణకు పిలువాల్సిందని కేటీఆర్ అన్నారు. రాత్రిపూట జర్నలిస్టుల ఇళ్లపై దాడిచేసి సబబు కాదని తప్పుపట్టారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలని తాను డిమాండ్ చేస్తున్నానన్నారు. వారిపై ఏమీ నాన్‌బెయిలబుల్ సెక్షన్‌ల కింద కేసులు నమోదు కాలేదని, అలాంటప్పుడు తెలంగాణ పోలీసులు జర్నలిస్టులను, వారి కుటుంబాలను ఎందుకు అర్ధరాత్రి అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ప్రశ్నించారు.జర్నలిస్టులను వెంటనే విడుదల చేసి వారి విషయంలో చట్టపరంగా నడుచుకోవాలని తాను డీజీపీని కోరుతున్నానని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీకి నీచ నాయకత్వానికి అనుగుణంగా మురికి రాజకీయాలు చేయవద్దని ఆయన సూచించారు. అసలు ఈ విషయాన్ని లీక్ చేసింది ఎవరు..? మిస్టర్ 30 పర్సెంట్ సపోర్టు లేకుండా ప్రభుత్వ అనుకూల టీవీ ఛానెల్ ఈ అంశాన్ని ప్రసారం చేసిందని మీరు భావిస్తున్నారా..? అని ప్రశ్నించారు.

## మకరజ్యోతి దర్శనం

- మార్మోగిన స్వామి శరణం నామస్మరణం..
- మకర జ్యోతిని అయ్యప్ప మాలధారులు భక్తి తన్మయత్వంతో దర్శనం..
- పులకించిపోయిన అయ్యప్ప భక్తులు...



**తిరువనంతపురం (తెలుగోడు), జనవరి 14 :** శబరిగిరులపై మకర జ్యోతి దర్శనమిచ్చింది. దాంతో స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణల మధ్య మకర జ్యోతిని అయ్యప్ప మాలధారణలో ఉన్న స్వాములు భక్తి తన్మయత్వంతో దర్శించుకున్నారు. జనవరి 14వ తేదీ మకర సంక్రాంతి సందర్భంగా సాయంత్రం 6.30 గంటల నుంచి 6.45 గంటల మధ్య మకర జ్యోతి దర్శనమిచ్చింది. అయితే ఈ సారి మకరవిలక్కు ఉత్సవాలకు వస్తున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు.కేరళ హైకోర్టు ఆదేశాలతో దర్శన కోటాపై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దాంతో పోలీసులు పక్కాగా భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ మకర దర్శనం కోసం సన్నిధానం, పంబ, శబరిమల కొండ, నీలిమల ప్రాంతాలు అయ్యప్ప స్వాములతో కిక్కిరిసిపోయాయి. దాంతో బుధవారం ఉదయం 10గంటల తర్వాత పంబ నుంచి సన్నిధానానికి భక్తులను అనుమతించ లేదని సమాచారం. పంచగిరులు.. నీలిమల, కరిమల, శబరిమల, అప్పాచిమేడు, అలుదామేడు ప్రాంతాల్లో ఈ దివ్య జ్యోతి దర్శనం స్పష్టంగా కనిపించింది. దాంతో ఆయా ప్రాంతాలన్నీ భక్తులతో నిండిపోయాయి. శబరిమలలో సంక్రాంతి పండగ వేళ.. పంచగిరులపై మకరవిలక్కు (మకర జ్యోతి)గా అయ్యప్ప స్వామి వారు దర్శనమిస్తారని భక్తులు ప్రగాఢ విశ్వాసం. గత కొన్ని శతాబ్దాలుగా ఈ ఆచారం కొనసాగుతోంది. దాంతో లక్షలాది మంది భక్తులు శబరిమలకు మకర సంక్రాంతి వేళ.. తరలివస్తారు. మరోవైపు ఈ రోజు అంటే.. బుధవారం మధ్యాహ్నం 3.13 గంటల నుంచి మకర సంక్రాంతి పుణ్యకాలం (మిగతా 2లో)

# తెలుగు రాష్ట్రాల్లో భోగి సంబరాలు



(మొదటి పేజీ (తరువాయి)

జరుపుతారు. రాష్ట్ర వ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఉత్సాహంగా భోగి సంబరాల్లో పాలుపంచుకున్నారు. విజయవాడలో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. వివాన్ గేటెడ్ కమ్యూనిటీలో అత్యంత వైభవోపేతంగా భోగి సంబరాలు నిర్వహించారు. అటు ప్రముఖ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయంలో భోగి సంబరాలు అంబరాన్నంటాయి. తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం నారావారిపల్లెలో భోగి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు స్వగ్రామం సొంత ఇంటి వద్ద భోగి పండుగ నేపథ్యంలో టెంకాయ, అరటి ఆకులతో ప్రత్యేక తోరణాలతో అలంకరించారు. పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం పెదఅమిరంలో ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు నివాసం వద్ద భోగి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాజకీయ ప్రముఖులు, జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప సభాపతి భోగి మంటలు వెలిగించారు. ఏలూరూ సమీపంలోని దుగ్గిరాలలో నిర్వహించిన సంక్రాంతి వేడుకలలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఎమ్మెల్యే. ఆపై భోగి మంటలు వెలిగించి సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. విశాఖపట్నంలోని ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో మహా సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భోగి మంటలు వేశారు. ఈ వేడుకల్లో పెద్దఎత్తున స్థానికులు పాల్గొన్నారు. ఈనెల 9 నుంచి 16 వరకు కాలేజీ గ్రౌండ్స్‌లో మహా సంక్రాంతి సంబరాలు జరుగనున్నాయి. ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా సెట్టింగ్స్, సాంప్రదాయ బద్ధమైన నృత్యాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. నెల్లూరు జిల్లాలో పెద్దఎత్తున భోగి సంబరాలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో నిర్వహించిన భోగి సంబరాల్లో మంత్రి నారాయణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ప్రజలతో కలిసి భోగి పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉందని మంత్రి నారాయణ అన్నారు. ప్రజలందరూ అష్టయిశ్వర్యాలతో తులతూగాలని మంత్రి ఆకాంక్షించారు. విజయవాడలో భోగి మంటలతో సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. వాడ వాడలా తెల్లవారుజాము నుంచే ప్రజలు భోగి మంటలు వేశారు. ఎంపీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో భోగి వేడుకలు నిర్వహించారు. ఎంపీ శాస్త్రోక్తంగా పూజలు చేసి భోగి మంటలు వెలిగించారు. ఈ వేడుకల్లో టీడీపీ నేతలు గద్దె అనురాధ, బొప్పన భవకుమార్ తదితరులు పాల్గొన్నారు. గత ప్రభుత్వంలో జగన్ ఫొటోతో ముద్రించిన పాస్ పుస్తకాలను భోగి మంటల్లో వేశారు టీడీపీ నేతలు. గంగిరెద్దులు, హరిదాసు కీర్తనలతో తెలుగు మహిళలు సందడి చేశారు. విజయవాడ గొల్లపూడిలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పార్థసారథి పాల్గొన్నారు. వేడుకలలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రికి మైలవరం శాసనసభ్యుడు వసంత కృష్ణ ప్రసాద్, స్థానిక నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆస్తి పత్రాలపై గత ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ఫొటోతో రూపొందించిన జీవో కాపీలను స్థానిక రైతులు, మంత్రి, ఎమ్మెల్యే కలిసి భోగి మంటలలో వేసి తగలబెట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్రం సస్యశ్యామలంగా ఉందని మంత్రి పార్థసారథి తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రపంచమంతా గుర్తిస్తోందన్నారు. వైసీపీ నాయకులకు రాష్ట్రంలో అభివృద్ధి కనిపించకపోవడం సిగ్గుచేటు అంటూ మంత్రి పార్థసారథి మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలందరికీ భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు హోంమంత్రి అనిత. అనకాపల్లి జిల్లాలోని నక్కపల్లి మంత్రి నివాసం వద్ద కుటుంబ సమేతంగా భోగి వేడుకలో అనిత పాల్గొన్నారు. భోగి పర్వదినం సందర్భంగా హోంమంత్రి నివాసం కోలాహలంగా మారింది. సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా భోగి వేడుకలు నిర్వహించారు. భోగి పండుగ వ్యవసాయ సంస్కృతికి ప్రతీకగా, రైతు జీవితంతో విడదీయరాని పండుగ అని అనిత అన్నారు. పాత కష్టాలను వదిలి.. కొత్త ఆశలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలని తెలిపారు. ఈ భోగి పండుగ రాష్ట్ర ప్రజలకు మంచి ఫలితాలు తీసుకురావాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, సమృద్ధి వెల్లివిరియాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తూ పాలన సాగిస్తున్నారని హోం మంత్రి పేర్కొన్నారు. కుటుంబసభ్యులతో కలిసి ఆమె భోగి మంటలు వేసి సందడి చేశారు. అనంతరం గో పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో ఏర్పాటు చేసిన కేరళ డప్పులను మంత్రి అనిత కొద్దిసేపు వాయించి అందరిలో ఉత్సాహం నింపారు

# జర్నలిస్టులపైనే సిట్ ఎందుకు

## కాంగ్రెస్ నేతల అవకతవకలపై సిట్ వేయండి
## అన్నింటిపైనా దమ్ముంటే విచారణ జరపండి
## వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ డిమాండ్

**హైదరాబాద్ (తెలుగోడు), జనవరి 15 :**

జర్నలిస్టుల అరెస్టుపై వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు మెతుకు ఆనంద్ మండిపడ్డారు. జర్నలిస్టులను అరెస్టు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మెతుకు ఆనంద్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రి, మహిళా ఐఏఎస్ అధికారిపై ఓ వార్త చానల్‌లో వచ్చిన కథనం నేపథ్యంలో చానళ్లు, డిజిటల్ మీడియా హ్యాండిళ్లపై దర్యాప్తు కోసం రేవంత్ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయడంపై విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారంలో సీరియల్స్‌లోమాదిరి 8 మంది పోలీసులతో సిట్ ఏర్పాటు చేశారని ధ్వజమెత్తారు.
ఎప్పుడో రేవంత్ రెడ్డిపై పోస్టు పెట్టిన కావలి వెంకటేశ్‌పైనా సిట్ వేశారని మెతుకు ఆనంద్ తెలిపారు. కొడంగల్ మద్దూరుకు చెందిన వ్యక్తిని కూడా సిట్‌లో ఇరికించారని పేర్కొన్నారు. అసలు సిట్ అనే దానికి ఏమైనా విలువ ఉందా అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. రేవంత్ భాషలో సిట్ అంటే కూర్చోవాలి.. స్టాండ్ అంటే నిలబడాలేమో అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేత సంపత్ కుమార్ అనుచరులు మా వాళ్లను బెదిరించారని తెలిపారు. దీనిపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ అవాస్తవాలు ప్రచారం చేస్తే సిట్ వేశారా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి కూడా అర్ధరాత్రి బుల్లెట్ మీద పోతున్నాడని మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. కోమటిరెడ్డి వ్యాఖ్యలపై సిట్ వేయరా అని ప్రశ్నించారు. ఆ రోజు ప్రెస్‌మీట్‌లో కోమటిరెడ్డికి ఏడుపొక్కటే తక్కువైందని అన్నారు. ఇంత విషమిచ్చి చంపండని కోమటిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారని గుర్తుచేశారు. మరి ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉన్న వారిపై సిట్ వేయరా అని నిలదీశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంటి ముందు కాంట్రాక్టర్లు ధర్నా చేశారని మెతుకు ఆనంద్ గుర్తుచేశారు. బిల్లులు చెల్లించేందుకు కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారని తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా కమీషన్లపై ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. దానిపై కదా సిట్ వేయాల్సింది అని అన్నారు. తుపాకీ పెట్టి బెదిరించి రూ.300 కోట్లు అడిగారని మంత్రి కొండా సురేఖ కూతురు చెప్పారు.. దానిపై కదా సిట్ వేయాల్సిందని అన్నారు. ములుగు జిల్లాలో మంత్రి ఇసుక దందా చేస్తున్నట్లు పత్రికల్లో వచ్చిందని తెలిపారు. దానిపై రేవంత్ రెడ్డి ఎందుకు సిట్ వేయలేదని ప్రశ్నించారు. వికారాబాద్‌లో ఎవరిని కదిలించినా కమీషన్లే అని విమర్శించారు. పోలీసుల దగ్గర మామూళ్లు, ట్రాన్స్‌ఫర్లకు కమీషన్లు అడుగుతున్నారని తెలిపారు. మోమిన్‌పేటలో రెండేళ్లలో ముగ్గురు సీఐలు మారారని తెలిపారు.



### రాజకీయ క్రీడలో భాగంగానే అరెస్టులు

కాంగ్రెస్ సర్కరార్ తీరుపై ఎమ్మెల్యే పల్లా ఆగ్రహం

ఎన్‌టీవీ జర్నలిస్టుల అక్రమ అరెస్ట్ ను ఖండిస్తున్నామని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం తమ రాజకీయ క్రీడలో భాగంగా నచ్చిన వారిని మంత్రులను చేయడానికి టీవీ చానెళ్లకు లీకులు ఇచ్చి ఉపయోగించుకొని మరల వారి మీదనే సిట్ వేసి అరెస్టులకు పాల్పడుతుందని ఆరోపించారు. అర్ధరాత్రి అక్రమంగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తలుపులు బద్దలు కొట్టి ఇంట్లోకి వెళ్లి అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జరుగుతున్న పరిణామాలన్నీ డ్రామాలని యావత్ ప్రజలకు తెలుసనీ, ఎమర్జెన్సీని తలపించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలు ఉన్నాయని మండిపడ్డారు. అరెస్ట్ చేసిన వారిని బేషరతుగా వెంటనే విడుదలచేయాలి డిమాండ్ చేశారు.కాగా, ఎన్టీవీ ఇన్‌ఫుట్ ఎడిటర్ దొంతు రమేశ్, రిపోర్టర్లు పరిపూర్ణచారి, సుధీర్‌లను మంగళవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. కుటుంబంతో విదేశాలకు వెళ్తుండగా దొంతు రమేశ్‌ను హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్టు చేయగా.. మరో ఇద్దరు రిపోర్టర్లను సైతం అదుపులోకి తీసుకున్నారు. మహిళా ఐఏఎస్, మంత్రి వార్త వ్యవహారంలో ఎన్టీవీ న్యూస్ ఛానల్‌పై చర్యలకు సిద్ధమైన తెలంగాణ ప్రభుత్వం.. ఈ మేరకు జర్నలిస్టులను అరెస్టు చేశారు.

# కొత్త హద్దులతో మాస్టర్ ప్లాన్

(మొదటి పేజీ (తరువాయి)

వెల్లడించారు. తాజా ప్రతిపాదనల మేరకు తూర్పున 16వ నెంబరు జాతీయ రహదారి హద్దుగా దక్షిణం, పడమర ప్రాంతంలో ఔటర్ రింగురోడ్డు, ఉత్తరాన కృష్ణానది ప్రాంతం మధ్యలో పూర్తిగా ప్లానింగు ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు. దాదాపుగా సిఆర్‌డిఏ రీజియన్ ప్రాంతం మొత్తం సమగ్ర ప్లానింగు పరిధిలోకి వస్తుంది. ప్రస్తుతం సిఆర్‌డిఏ ప్రాంతం సుమారు 8352 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. అంటే సుమారుగా 20.88 లక్షల ఎకరాలకు విస్తరించి ఉంది. దీనిలో కనీసం మూడు లక్షల ఎకరాల పరిధిలోకి రాజధాని ప్లానింగు ఏరియా పెరుగుతుందనేది అంచనాగా వేస్తున్నారు. ప్రస్తుతం 16వ నెంబరు జాతీయ రహదారికి ఈ3, ఈ5 రోడ్లను కలపనున్నారు. ఈ3 రోడ్డును రెండోదశ ల్యాండ్ పూలింగు పరిధి వరకు తీసుకెళ్లే విధంగ ఆలోచన చేస్తున్నారు. సమీకరణ ప్రాంతంలో రోడ్ కనెక్టివిటీ పూర్తి చేసిన తరువాత అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పనిలో పనిగా మొత్తం ఔటర్‌రింగురోడ్డుకూ అనుసంధానం చేయాలని భావిస్తున్నారు. కాగా, ఇన్నర్ రింగురోడ్డు, ఔటర్ రింగురోడ్డుకు మధ్యలో అభివృద్ధికి అవసరమైన ప్లానింగు చేయాలని తొలి మాస్టర్ ప్లాన్ ఖరారు వేళ నిర్ణయించారు. రాజధాని చుట్టుపక్కల ఏడు ప్రాంతాల ను పారిశ్రామిక, వాణిజ్య కేంద్రాలుగా గుర్తించారు. రింగురోడ్లను కూడా వాటిని దృష్టిలో పెట్టుకునే ప్లాను చేశారు. గుడివాడ, గుంటూరు, తెనాలి, సత్తెనపల్లి, కంచికచర్ల, కంకిపాడు, ఉయ్యూరు పరిసరాల్లో ప్రత్యేక అభివృద్ధి కేంద్రాలనూ ఏర్పాటు చేయాలనేది అప్పటి ప్రతిపాదన. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కేంద్రంగా గుడివాడ, ఆహ్లాద, పర్యాటక ప్రాంతంగా తెనాలి, లాజిస్టిక్ కేంద్రంగా గన్నవరం ప్రాంతాలను అప్పట్లో ప్రతిపాదించారు. ప్రస్తుతం మాస్టర్‌ప్లాను రూపొందించాలనే మంత్రి ప్రకటన నేపథ్యంలో ఇప్పుడు కొత్తగా ఎలాంటి ప్రతిపాదనలు చేస్తారనేది ఆసక్తి కరంగా మారుతోంది.

# భారతీయులు ఇరాన్‌ను తక్షణమే వీడండి

**న్యూ ఢిల్లీ (తెలుగోడు), జనవరి 15 :**

ఇరాన్‌లో కొనసాగుతున్న రాజకీయ అస్థిరత, హింసాత్మక నిరసనలు మరియు భద్రతా పరిస్థితుల దృష్ట్యా, భారత ప్రభుత్వం తన పౌరులకు ఒక హెచ్చరిక జారీ చేసింది. ఇరాన్‌లోని అన్ని భారతీయ పౌరులు, విద్యార్థులు, యాత్రికులు, వ్యాపారవేత్తలు లేదా పర్యాటకులు అందుబాటులో ఉన్న మార్గాలను ఉపయోగించి వీలైనంత త్వరగా దేశం విడిచి వెళ్లాలని టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం కోరింది. జనవరి 5న భారత ప్రభుత్వం జారీ చేసిన సలహాకు ఈ సలహా పొడిగింపు అని రాయబార కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.. ఇరాన్‌లో నిరంతరం మారుతున్న పరిస్థితుల దృష్ట్యా , వాణిజ్య విమానాలు సహా అందుబాటులో ఉన్న ఏదైనా రవాణా మార్గం ద్వారా భారతీయ పౌరులు ఇరాన్‌ను విడిచి వెళ్లాలని సూచించారు.ఇరాన్‌లో ఉన్న అన్ని భారతీయ పౌరులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి నిరసనలు లేదా రద్దీగా ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండాలని మరియు పరిస్థితిపై తాజా పరిస్థితుల కోసం స్థానిక మీడియాను ఫాలో కావాలని భారత రాయబార కార్యాలయం తెలిపింది.. భారత పౌరులు తమ ప్రయాణ మరియు ఇమ్మిగ్రేషన్ పత్రాలన్నింటినీ పాస్‌పోర్ట్‌లు మరియు గుర్తింపు కార్డులు వంటివి ? ఎల్లప్పుడూ తమ వద్ద ఉంచుకోవాలని.. తక్షణమే అందుబాటులో ఉండాలని రాయబార కార్యాలయం కోరుతోంది. వారికి ఏదైనా సహాయం అవసరమైతే వెంటనే భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని కూడా వారు కోరారు. ఇటీవలి ఇరాన్‌లో విస్తృత నిరసనలు, హింస మరియు భద్రతా చర్యలు జరిగాయి, దీనివల్ల విదేశీ పౌరుల భద్రత గురించి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్‌పై సైనిక చర్య తీసుకుంటామని అమెరికా బెదిరిస్తూనే ఉన్న విషయం విదితమే..


# 20 వేల పిడకలతో భోగి మంటలు



**కోనసీమ (తెలుగోడు), జనవరి 15 :**

తెలుగువారు జరుపుకునే పెద్ద పండుగల్లో సంక్రాంతి ఒకటి. తెలుగువారు మూడు రోజుల పాటు ఈ పండుగను జరుపుకుంటారు. ముఖ్యంగా మొదటి రోజు నిర్వహించే భోగి ప్రత్యేకమనే చెప్పుకోవాలి. తెల్లవారుజామునే అభ్యంగ స్నానమాచరించి.. ఆవు పేడతో చేసే పిడకలను భోగి మంటల్లో వేస్తారు. చిన్నా పెద్దా అంతా కలిసి భోగి మంటల చుట్టూ తిరుగుతూ ఆడిపాడుతూ ఉత్సాహంగా గడుపుతారు. ప్రతి ఇంటి ముంగిళ్లలో భోగి మంటలు దర్శనమిస్తాయి. ఇంట్లోని పాత, ఉపయోగంలో లేని వస్తువులను భోగి మంటల్లో వేస్తే శుభం కలుగుతుందని ప్రజలు విశ్వసిస్తారు. ఇదిలా ఉండగా.. భోగి పండుగను పురస్కరించుకుని అంబేడ్కర్ కోనసీమలో రూపొందించిన భారీ భోగి దండ అందరినీ ఆకట్టుకుంటోంది. అమలాపురంలోని రంగాపురం గ్రామస్థులు ఈ భోగి మాలతో సంక్రాంతి ఉత్సవాలను నిర్వహించారు. దాదాపు 20 వేల పిడకలతో 1000 అడుగుల భారీ భోగి దండను తయారు చేశారు గ్రామస్థులు. ఆ ఊళ్లోని విశ్వనాథ రాజు కుటుంబం.. స్థానికులతో కలిసి ఆవు పేడతో 20 రోజుల పాటు శ్రమించి ఈ హారాన్ని తయారు చేసింది. తెలుగు ప్రజల సంస్కృతి సాంప్రదాయాలు తెలియ జేసేందుకు గత ఆరేళ్లుగా భారీ భోగి దండలను గ్రామస్థులు తయారు చేస్తున్నారు. ఆరేళ్ల క్రితం 400 అడుగులతో మొదలైన భోగి దండ తయారీ నేడు 1000 అడుగులకు చేరిందని ఆ ఊరి ప్రజలు వివరించారు. సుమారు అర కిలోమీటర్ మేర ఉన్న ఈ భారీ భోగి మాలను గ్రామస్థులతో కలిసి విశ్వనాథరాజు కుటుంబ సభ్యులు భోగి మంటలో వేశారు. ఈ మాలను మంటలో వేసేందుకు తరలివచ్చిన వారితో ఈ ఊళ్లో సందడి వాతావరణం నెలకొంది. ప్రస్తుతం.. ఈ భారీ భోగి దండ జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.మరోవైపు.. కాకినాడ జిల్లా పిఠాపురం జై గణెళిశ స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో 14 వేల ఆవు పిడకలతో భోగిమంట వేశారు. ఆలయం నుంచి మేళ తాళాలు, తప్పెడు గూళ్లు, గంగిరెద్దులు, హరిదాసుల సంకీర్తనలతో కోటగుమ్మం సెంటర్ వద్ద భోగి మంట వేశారు. ఆలయ అర్చకులు మైలవరపు రామకృష్ణ భోగి మంట వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

# అమెరికాతో చేరేది లేదు



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), జనవరి 15 :**

అమెరికాలో స్వాధీనంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులపై గ్రీన్‌ల్యాండ్ స్పందించింది. తాము అమెరికాలో చేరబోమని, డెన్మార్క్ యూనియన్‌లోనే ఉంటామని గ్రీన్‌ల్యాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ పేర్కొన్నారు. పరిస్థితి చాలా తీవ్రంగా ఉందని, తమ దేశాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకునేందుకు అమెరికా బెదిరింపులకు దిగుతోందని మండిపడ్డారు. అమెరికానా, డెన్మార్కా ఎంపిక చేసుకోమంటే.. తాము డెన్మార్క్‌నే ఎంపిక చేసుకుంటామని స్పష్టం చేశారు. వాస్తవానికి గ్రీన్‌ల్యాండ్ డెన్మార్క్‌లో భాగమని జెన్స్ ఫ్రెడరిక్ పేర్కొన్నారు. కోపెన్‌హాగన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డానిష్ ప్రధాని మెట్ ఫ్రెడరిక్‌సన్ కూడా ఈ సమావేశంలో పాల్గన్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, విదేశాంగ కార్యదర్శి మార్క్ రూబియోలతో డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్ విదేశాంగ మంత్రులు బుధవారం జరగనున్న ఉన్నత స్థాయి చర్చలకు ముందు ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. గ్రీన్‌ల్యాండ్‌పై బెదిరింపులను తగ్గించడం, దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించడం ఈ చర్చల లక్ష్యమని పేర్కొన్నారు. ట్రంప్ బెదిరింపులు ,ఆర్థిక ఒత్తిడి లేదా సైన్యాన్ని ప్రయోగించడం ద్వారా గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు ట్రంప్ యత్నిస్తున్న సంగతి తెలిసిందే. జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ వ్యాఖ్యలపై ట్రంప్ మరింత బెదిరింపులకు దిగారు. తరువాత వారికి పెద్ద సమస్యను సృష్టించగలదని హెచ్చరించారు. అది వాళ్ల సమస్యఅని అన్నారు. వారి సమస్యతో తాను విభేదిస్తున్నానని అన్నారు.

# ఉద్యోగులకు 110కోట్లు విడుదల

(మొదటి పేజీ (తరువాయి)

ఎరియర్స్ నిమిత్తం ఒక్కో ఉద్యోగి, పోలీసుల ఖాతాల్లో రూ.70 నుంచి రూ.80 వేల వరకు నగదు జమ అవుతుంది. పండగ పూట డీఏ, డీఆర్‌ఏ బకాయి లు జమ కావడంతో ఉద్యోగులతోపాటు ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సాయంత్రం లోగా అందరి ఉద్యోగుల ఖాతాల్లోనూ బకాయిలు జమ అవుతాయని అధికారులు వెల్లడించారు.

# సంక్రాంతి శోభ

(మొదటి పేజీ (తరువాయి)

ఈ మేరకు రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంక్రాంతి సౌభాగ్యాన్ని అందించాలని సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా పవన్ ఆకాంక్షించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో పల్లెలు పండుగ శోభతో కళకళలాడుతున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం రాకతో ఆంధ్రప్రదేశ్ అంతటా ప్రశాంతత వెల్లివిరుస్తోందన్నారు. శాంతి, సామరస్యం ఉన్నచోట రోజూ పండుగే అని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ఇటువంటి తరుణంలో జరుగుతున్న ఈ సంక్రాంతి పండుగ నాడు ప్రతి ఇల్లూ సౌభాగ్యంతో విలసిల్లాలని పవన్ కోరారు.

# పాటలో అన్నీ నిజాలే

(మొదటి పేజీ (తరువాయి)

ప్రజలు ఇవాళ కాకపోతే రేపు గ్రహిస్తారని, కూటమి ప్రభుత్వాన్ని కూలుస్తారని తెలిపారు. తాను సత్తెనపల్లి నుంచి తాను గుంటూరుకు వచ్చేయడం వల్ల ఇక్కడే ఈ పాట చేశామన్నారు. అలాగే సంక్రాంతి అనగానే తాను గుర్తుకురావడానికి ప్రధాన కారణం పవన్ కళ్యాణ్ అన్నారు. తాను సంక్రాంతికి డ్యాన్స్ వేస్తే సంబరాల రాంబాబు అని పవన్ అన్నారని, దాంతో పాటు బ్రో సినిమాలో తన క్యారెక్టర్ పెట్టి గేలి చేశాడన్నారు. మొన్న సంక్రాంతి డ్యాన్స్ ఆయనే చేశాడని గుర్తుచేశారు. అయితే ఆ స్టెప్పులు మాత్రం తనవి కాదన్నారు. ఆయన సినిమా నటుడిగా ఉండి తన స్టెప్పుల్ని అంత పాపులర్ చేయడం వల్లే తనకు ఇంత పేరు వచ్చిందన్నారు. తనను సంబరాల రాంబాబు అని పవన్ అంటే అవును.. నేను సంక్రాంతి సంబరాలు చేస్తాను కాబట్టి సంబరాల రాంబాబునే అన్నానని, కానీ ఆయన మాత్రం చెప్పుకోలేదన్నారు. ఆయన రాజకీయ నాయకుడు కాదని యాక్టర్ మాత్రమేనన్నారు. ఆయన ఎప్పటికీ రాజకీయ నాయకుడు కాలేరన్నారు. అది ఆయన స్వభావం అన్నారు.

# మకరజ్యోతి దర్శనం

(మొదటి పేజీ (తరువాయి)

ప్రారంభమైంది. దీంతో స్వామివారికి మేల్ శాంతుల పేరిట తంత్రిలు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఇక జనవరి 12వ తేదీన పందళం రాజప్రసాదంనుంచి బయలుదేరిన స్వామివారి ఆభరణాలు ఈ రోజు సాయంత్రం 5.20 గంటలకు స్వామివారి సన్నిధికి చేరుకున్నాయి. వాటిని స్వామివారికి అలంకరించి.. మహదీపారాధన నిర్వహించారు. ఈ దీపారాధన అనంతరం పొన్నంబలమేడు కొండపై మకరజ్యోతి మూడుసార్లు దర్శనమిచ్చింది. అంటే సాయంత్రం 6.30 గంటల నుంచి 6.45 గంటల వరకు అంటే పావుగంట మధ్య మూడుసార్లు స్వామివారు దీప రూపంలో దర్శనమిచ్చారు. జనవరి 19వ తేదీ వరకు స్వామివారి దర్శనం కొనసాగనుంది. ఆ మరునాడు అంటే జనవరి 20వ తేదీ ఆలయాన్ని మూసివేయనున్నారు.

# పడిపోయిన టమోట ధర




**మదనపల్లె (తెలుగోడు), జనవరి 15 :**

మదనప్లలెలో కిలో టమోటా రూ.25కు పడిపోయాయి. మంగళ వారం మదనపల్లె వ్యవసాయ మార్కెట్‌కు 90 మెట్రిక్ టన్నుల టమోటా మాత్రమే వచ్చాయి. వాటిలో పది కిలోల మొదటి రకం టమోటాలు రూ.250, రెండో రకం రూ.230, మూడో రకం రూ.200లతో వ్యాపారులు రైతుల వద్ద కొనుగోలు చేశారని మార్కెట్ సెక్రటరీ జగదీష్ తెలిపారు. పదిరోజుల క్రితం కిలో టమోట రూ.50 పలుకగా, వారం రోజులుగా రేట్లు రోజు రోజుకు తగ్గు ముఖం పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరలు పతనం కావడంతో కనీసం పంటలు వేసేందుకు ఖర్చు చేసిన పెట్టుబడి కూడా రావడం లేదని, ధరలు ఇలాగే కొనసాగితే వ్యవసాయం చేయకుండా మానేయడమే మేలని రైతులు అంటున్నారు. మార్కెట్ యార్డులో ధరలు పతనం కాగా బహిరంగ మార్కెట్‌లో మాత్రం టమోటా ధరలు అకాశాన్నంటు తుండడంతో వినియోగదారులు బేంబేలెత్తుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో మొదటి రకం కిలో టమోటా రూ.50 పలుకుతుండడం గమనార్హం. మరికొన్ని చోట్ల ఈ ధర మరింత ఎక్కువగా తీసుకుంటున్నారు. ఈ ధరలవల్ల పంట పండించే రైతు తీవ్రంగా నష్టపోతుండగా వ్యాపారులు మాత్రం అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి రైతులకు గిట్టుబాటు బాట ధర కల్పించేలా చర్యలు తీసుకోవాల్సి కోరుతున్నారు.

# మరోమారు రాజ్యసభకు నో

**న్యూ ఢిల్లీ (తెలుగోడు), జనవరి 15 :**



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మూడోసారి రాజ్యసభకు పోటీ చేయడం లేదని చెప్పారు. ఏప్రిల్ 2026లో ఆయన పదవీకాలం ముగియనున్నది. అయితే మధ్యప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ శాఖ అధ్యక్షుడు ప్రదీప్ అహిర్‌వార్ నుంచి అభ్యర్థన రావడం వల్ల దిగ్విజయ్ తన రాజ్యసభ సీటును త్యాగం చేయబోతున్నట్లు తెలుస్తున్నది.షెడ్యూల్ కులాలకు చెందిన నేతను ఎగువ సభకు పంపాలని భావిస్తున్నట్లు ప్రదీప్ తెలిపారు. జనవరి 13వ తేదీన ప్రదీన్ ఓ లేఖ రాశారు. సామాజిక న్యాయం కోసం మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ సీటుపై ఓ దళితుడిని పంపాలని భావిస్తున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో ఎస్సీలు 17 శాతం ఉన్నట్లు తెలిపారు. రాజ్యసభను వదిలేది నా చేతుల్లో లేదని, కానీ తన రాజ్యసభ సీటును ఖాళీ చేస్తున్నానని దిగ్విజయ్ ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. 2014 నుంచి ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. మధ్యప్రదేశ్ సీఎంగా యాన రెండు సార్లు బాధ్యతలు నిర్వర్తించారు. 1993 నుంచి 2003 వరకు ఆయన సీఎంగా చేశారు. 2003లో ఓడి పోయిన తర్వాత రాజకీయాలకు దిగ్విజయ్ స్వస్తి పలికారు. పదేళ్ల తర్వాత ఆయన రాజ్యసభలోకి ఎంట్రీ ఇచ్చారు.



బసవన్నలను సన్మానిస్తున్న బీజేపీ నేత ప్రతాప్ రెడ్డి

## ఘనంగా మకర సంక్రాంతి సంబరాలు

**తాడిపత్రి (తెలుగోడు), జనవరి 14 :**
పట్టణంలోని జాయ్ చిల్డ్రన్స్ పార్క్‌లో బుధవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పీవీ ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలోమకర సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పీవీ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలు, రైతులు సుఖ శాంతులతో సుభిక్షంగా, ఉండాలని సూర్యభగవానుడిని, గోమాతలను పూజించామని తెలిపారు. అనంతరం మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలను సంరక్షిస్తున్న బసవన్నలను ఘనంగా సన్మానించామన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మైదుకూరు ఆంజనేయులు, పట్టణ, రూరల్ అధ్యక్షులు రంగనాయకులు, శేషానందరెడ్డి, ఓబిరెడ్డి, వెంకట సుబ్బయ్య, మధు, ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాధితురాలికి నగదు అందిస్తున్న దృశ్యం

## బాధితురాలికి ఆర్థిక సహాయం

**తాడిపత్రి (తెలుగోడు), జనవరి 14 :**
ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం బాధితురాలు సుభద్రకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈసందర్భంగా ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ వర్కింగ్ ప్రెసిడెంట్ నారబోయిన శంకర్ మాట్లాడుతూ వజ్రకరూరు మండలంలోని పొట్టిపాడు గ్రామానికి చెందిన సుంకన్న పద్మావతిల కుమార్తె సుభద్ర గత కొంతకాలంగా గుండె జబ్బుతో బాధపడుతూ రెండుసార్లు శస్త్ర చికిత్సలు చేయించుకుందని తెలిపారు. శస్త్ర చికిత్సలకై కుటుంబ సభ్యులు లక్షలాది రూపాయలు అప్పులు చేశారని, కుటుంబం తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితులలో ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థను ఆశ్రయించారని తెలిపారు. తమవంతు సహాయంగా ఆ కుటుంబానికి 16 వేల రూపాయలు నగదు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సంస్థ గౌరవ సలహాదారులు శ్రీరంగయ్య, ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య, రామచంద్రప్ప, సభ్యులు సుధాకర్, గురు ప్రసాద్, శివప్రసాద్ పాల్గొన్నారు.

## ప్రజలందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు

### ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్..

**బెళగుప్ప (తెలుగోడు), జనవరి 14 :**



సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలంతా సుఖ సంతోషాలతో, భోగ భాగ్యాలతో, సిరి సంపదలతో తులతూగాలని, సంక్రాంతి, కనుమ పండుగలను ఆనందంగా జరుపుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ బుధవారం ఒక ప్రకటనలో సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మకర సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలందరూ సహృద్భావ వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని, అందరూ సుఖ సంతోషాలతో భోగ భాగ్యాలతో పాడి పంటలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లేలా భగవంతుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని హృదయ పూర్వకంగా ఆకాంక్షిస్తున్నామని, శుభాకాంక్షలు తెలిపారు.



కొండుపల్లిలో భోగి సందర్భంగా ఎద్దుల బండ్ల ప్రదర్శన నిర్వహిస్తున్న రైతులు

## ఎద్దుల బండ్ల ప్రదర్శన

### ఏపీ రైతు సంఘం నాయకులు..

**యాడికి (తెలుగోడు), జనవరి 14 :**
రైతు గెలవాలి వ్యవసాయం నిలవాలని బుధవారం పెద్దవడుగూరు మండలము పరిధిలోని కోండుపల్లి గ్రామంలో భోగి పండుగ సందర్బంగా ఏపిరైతు సంఘము అధ్వర్యంలో ఎద్దుల బండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ సంధర్బంగా రైతు సంఘం సీనియర్ నాయకులు వై.సూర్యనారాయణరెడ్డి, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు వెంకటరాముడు యాదవ్ మాట్లాడుతూ భోగి పండుగ నుండి రైతులు రైతు సుభిక్షంగా ఉండాలని, రైతుల లోగిళ్లు ధ్యారాశులతో కళకళాడాలని, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను ప్రభుత్వం అందుబాటులోకి తేవాలని, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, రైతులు ఖరీఫ్‌లో పండించిన పంటలకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలకు కనీసవం 30 శాతం బోనస్‌తో ప్రభుత్వమే రైతు సేవా కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధర అందించి కొనుగోలు చేయాలని కోరారు. ఇప్పటికైనా కేంద్రరాష్ట ప్రభుత్వాలు రైతులను అన్ని విధాలుగా రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం తాడిపత్రి నీయోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు ఆదినారాయణ, ఓబిరెడ్డి,పోలా రంగస్వామి, అల్లాబకాష్, క్రిష్ణమూర్తి, నరేష్, నాగరాజు, కార్తీక్ ,నాగభూషణం, వీర బాలయ్య, దస్తగిరెప్ప రైతులు పాల్గొన్నారు.



కొండుపల్లిలో భోగి సందర్భంగా ఎద్దుల బండ్ల ప్రదర్శన నిర్వహిస్తున్న రైతులు



బెళుగుప్పలో పాత వస్తువులను వేసి భోగి మంటలు వేసుకున్న ప్రజలు.
చిన్నారులకు భోగి పళ్లు పోసి ఆశీర్వదిస్తున్న మాజీ ఎంపీటీసీ కంచిరాముడు దంపతులు

## బెళుగుప్పలో ఘనంగా భోగి పండుగ

### వేకువజామునే భోగిమంటలు.. చిన్నారులకు భోగిపళ్లు..

**బెళగుప్ప (తెలుగోడు), జనవరి 14 :**
మండల కేంద్రమైన బెళుగుప్ప, వివిధ గ్రామాలలో మూడు రోజుల సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మొదటిరోజు బుధవారం భోగి పండుగను ఎంతో ఘనంగా నిర్వహించుకున్నారు. బుధవారం బోగిని పురస్కరించుకొని వేకువజామునే కుటుంబ సభ్యులతో చిన్నారులు పాత వస్తువులను వేసి భోగి మంటలు వెలిగించారు. ఇళ్లల్లో చిన్నారులకు అమ్మలు భోగి పళ్ళు పోసి హారతులు ఇచ్చి ఆశీర్వదించారు. అలాగే ఇళ్ళ ముందు భోగిని పురస్కరించుకొని మహిళలు వివిధ రంగులతో ముగ్గులు వేశారు. మూడు రోజుల సంక్రాంతి పండుగను ఎంతో ఘనంగా నిర్వహించేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారు.



చిన్నారులకు భోగిపళ్లు పోసి హారతులు ఇచ్చి ఆశీర్వదిస్తున్న అమ్మలు



భోగి సందర్భంగా ఇళ్ల ముందు రంగులతో ముగ్గులు వేసిన దృశ్యం

## గొర్రెల దొంగతనం కేసు ఛేదించిన పోలీసులు

### ఇద్దరు దొంగలు అరెస్ట్ 30 గొర్రెలు, 31 మేకలు, 12 పొట్టేళ్లు స్వాధీనం.. గూడ్స్ వాహనం జప్తు..

**తాడిపత్రి (తెలుగోడు), జనవరి 14 :**
తాడిపత్రి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని పెద్ద వడుగూరు గ్రామంలో జరిగిన గొర్రెల దొంగతనం కేసును ఛేదించామని బుధవారం తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి తెలిపారు. జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి వివరాలు వెల్లడించారు. ఈనెల 9న రాత్రి పెద్దవడుగూరు గ్రామములో బాల చిన్న నేట్టికంటయ్య ఇంటి వద్ద ఉన్న గొర్రెలు దొంగతనం జరిగినట్లు ఆ యజమాని బాల చిన్న నేట్టికంటయ్య ఫిర్యాదు చేశారు. దీంతో పెద్దవడుగూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారని తెలిపారు. ఈ కేసు దర్యాప్తును ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ఆదేశాలతో పెద్ద వడుగూరు సీఐ రామ సుబ్బయ్య అద్వర్యంలో ఎస్సై ఆంజనేయులు,



పోలీసులు స్వాధీనం చేసుకున్న గొర్రెలు



గొర్రెల చోరీ వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి

సిబ్బందిని రంగంలోకి దింపారు. ఈక్రమంలో రాబడిన సమాచారం మేరకు పెద్దవడుగూరు ఎస్సై, సిబ్బంది ఆధ్వర్యంలో వేగవంతమైన దర్యాప్తు చేపట్టి, కేసు ఛేదించి బుక్కరాయసముద్రం గ్రామ పరిసర ప్రాంతంలో రాప్తాడు మండలానికి చెందిన దేరంగుల విజయ్, అనంతపురం, చంద్రబాబు నగర్ కు చెందిన మొండి నాగార్జునలను అరెస్టు చేశారని తెలిపారు. ప్రస్తుతం అరెస్టయిన ఇద్దరిలో విజయ్ కుమార్ ముఖ్యుడని, ఇతనిపై పలు పోలీస్ స్టేషన్ లలో దొంగతనం కేసులు నమోదు అయి జైలుకు వెళ్లొచ్చాడని తెలిపారు. విజయ్ కుమార్ ఇతని స్నేహితులు కలసి పెద్దవడుగూరు, ముదిగుబ్బ, సింహాద్రి పురంలలో పోలీస్ స్టేషన్ పరిదిలలో దొంగతనం చేసిన గొర్రెలు, పొట్టేళ్ళు, మేకలను బుక్కరాయ సముద్రం పరిధిలోని విరుపాక్షనగర్ లో దాచి ఉంచారని తెలిపారు. వారివద్ద నుంచి రూ. 7.50 లక్షల విలువ చేసే 30 గొర్రెలు, 31 మేకలు, 12 పొట్టేళ్లు, టాటా పికప్ గూడ్స్ వాహనం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పెద్దవడుగూరు సీఐ రామ సుబ్బయ్య, ఎస్సై ఆంజనేయులు సిబ్బంది రామక్రిష్ణ, మోహన్, ఓబులపతి, నబిరసూల్, షాషావలి, కిషోర్ రాజు, మన్సూర్ ఇలాహి, దాదాకలందర్ నిందితులను అరెస్టు చేయడంలో పాల్గొన్నారని తెలిపారు.

## శబరిమలైకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు

### ఇరుముడి ప్రత్యేక పూజలు.. గురుస్వామి పర్వతప్ప స్వామి..

**బెళగుప్ప (తెలుగోడు), జనవరి 14 :**
కేరళ రాష్ట్రంలోని శబరిమలై శ్రీ అయ్యప్ప స్వామి దర్శనానికి మాలధారణ భక్తులు బుధవారం బయలుదేరారు. బెళుగుప్ప శ్రీ అయ్యప్పస్వామి సన్నిధానంలో 31వ పడి గురుస్వామి పర్వతప్ప స్వామి, 19వ పడి గురుస్వామి జయకృష్ణ స్వామి ఆధ్వర్యంలో శ్రీ అయ్యప్ప స్వామికి శ్రీ



బెళుగుప్ప శ్రీ అయ్యప్పస్వామి సన్నిధానంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాలధారణ భక్తులు



గురుస్వాములు పర్వతప్ప స్వామి, జయకృష్ణ స్వామి ఆధ్వర్యంలో శబరిమలైకు బయలుదేరిన మాలధారణ భక్తులు

ధర్మ శాస్త్ర ఇరుముడి ప్రత్యేక పూజలు" ఓం శ్రీ స్వామియే శరణమయ్యప్ప" శరణాలు పలుకుతూ శబరిమలైకు బయలుదేరారు. బెళుగుప్ప కు చెందిన పలువురు శబరిమలై శ్రీ అయ్యప్పస్వామి భక్తులు 41 రోజులపాటు మాలధారణ ధరించి, ప్రతిరోజు సన్నిధానంలో ఉదయం, సాయంత్రం శ్రీ అయ్యప్ప స్వామి చిత్రపటానికి ప్రత్యేక భజనలతో పూజలు చేసుకుంటూ దీక్షతో ఉన్నారు. బుధవారం సన్నిధానంలో గురుస్వాములు పర్వతప్ప స్వామి, జయకృష్ణ స్వామి ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు బంధుమిత్రులతో ఇరుముడి కట్టుకుని ప్రత్యేక వాహనాలలో కేరళ రాష్ట్రంలోని శబరిమలై కొండకు బయలుదేరి వెళ్లారు.



బెళుగుప్ప శ్రీ అయ్యప్పస్వామి సన్నిధానంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాలధారణ భక్తులు


## కేజీబీవీలో పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

### డివైఈవో మల్లారెడ్డి.. ఎంఈఓ 2 హరికృష్ణ..

**బెళగుప్ప (తెలుగోడు), జనవరి 14 :**



బెళుగుప్ప కేజీబీవీలో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డివైఇఓ, ఎంఈఓ 1 మల్లారెడ్డి, ఎంఈఓ 2 హరికృష్ణ పేర్కొన్నారు. కేజీబీవీలో ఖాళీగా ఉన్న పోస్టులను ఔట్ సోర్సింగ్, ప్రాతిపదికన భర్తీ చేస్తున్నట్లు వారు తెలిపారు. బెళుగుప్ప కేజీబీవీ లో ఒక అటెండర్, ఏఎన్ఎం పోస్టులను భర్తీ చేయదానికి మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులు, ఆసక్తి కలిగిన మహిళ అభ్యర్థులు ఈనెల 12వ తేదీ నుంచి 23వ తేదీలోపు అనంతపురం సమగ్ర శిక్ష కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని పూర్తి వివరాలకు http://samagrashikhaatp.blogspot.com వెబ్ సైట్ ను సంప్రదించాలని డివైఈఓ, ఎంఈఓ 1 మల్లారెడ్డి, ఎంఈఓ 2 హరికృష్ణ పేర్కొన్నారు.





నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసులు

## కాపర్ వైరు చోరీ దొంగల పట్టివేత

### సీఐ శ్రీనివాసులు ..

**యాడికి (తెలుగోడు), జనవరి 14 :**
యాడికి మండలంలో కాపర్ వైర్ల చోరీ దొంగలను పట్టుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. గత కొన్ని రోజుల నుంచి రాయలచెరువు, పెద్దపేట, చందన గ్రామాలకు సంబంధించిన రైతుల పొలాలలో ఉన్న బోరు బావులకు సంబంధించిన 4కేవీ, 6కేవీ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్తున్నారు. మంగళవారం నాడు రాయల చెరువు గ్రామానికి చెందిన రైతు గణపర్తి గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. తాడిపత్రి సబ్ డివిజనల్ అధికారి ఏ ఎస్ పి రోహిత్ కుమార్ చౌదరి ఆధ్వర్యంలో దర్యాప్తులో భాగంగా బుధవారం అందిన సమాచారం మేరకు రాయలచెరువు గ్రామంలో ఉన్న గుజిరి వ్యాపారి వద్ద కొంతమంది వ్యక్తులు వైరు కాల్చిన కాపర్ అమ్ముచుండగా పట్టుకుని విచారించామన్నారు. వారి వద్ద 500 మీటర్లు 6కేవీ వైరు, 30 కేజీల కాల్చిన కాపర్ వైరు స్వాధీనం చేసుకున్నామన్నారు. పసుపులేటి రమేష్, నగిరి చెన్నమ నాయుడు, నూతన కమలాకర్, మిడుతూరి మౌలాలి ని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**బెళగుప్ప (తెలుగోడు), జనవరి 14 :**
బెళుగుప్ప మండలం పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలో బుధవారం వేంపల్లి నాగేశ్వరరావు (53) అనే వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య కు పాల్పడ్డాడు. గ్రామస్తులు అందించిన వివరాల మేరకు అన్నమయ్య జిల్లా రాయచోటి కి చెందిన వేంపల్లి నాగేశ్వరరావు గుండ్లపల్లి సమీపంలోని డీఎంసీ కంపెనీలో తారుప్లాంట్ ఆపరేటర్ గా పని చేస్తూ గుండ్లపల్లి లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఉండేవాడన్నారు.



అయితే సంక్రాంతి పండుగ సందర్భంగా సెలవు ఉండడంతో నాగేశ్వరరావు బుధవారం ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు..

## శతాధిక వృద్ధుడు అక్కిశెట్టి దొణప్ప మృతి

**బెళగుప్ప (తెలుగోడు), జనవరి 14 :**
బెళుగుప్పకు చెందిన శతాధిక వృద్ధుడు అక్కిశెట్టి దొణప్ప (101) బుధవారం మృతి చెందాడు. అక్కిశెట్టి దొణప్ప గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృత్తోడు అక్కిశెట్టి దొణప్ప కు ఐదుగురు కొడుకులు, నలుగురు కుమార్తెలు, మనవళ్లు, మనవరాళ్లు,



మునిమనవళ్లు, ముని మనవరాళ్లు ఉన్నారు. సంక్రాంతి పండుగ భోగి రోజు బుధవారం మృతి చెందడంతో కుటుంబ సభ్యుల్లో తీవ్ర విషాదఛాయలు నెలకొన్నాయి. కలుషితం లేని ఆహారం, నీరు, ఎటువంటి ఒత్తిడికి లోను కాకుండా దొణప్ప ఉండడం తోనే 101 సంవత్సరాలు జీవించాడని కుటుంబ సభ్యులు తెలిపారు..



పోలీసులు సీజ్ చేసిన జెసిబి, ట్రాక్టర్లు

## జెసీబి, మూడు ట్రాక్టర్లు పట్టివేత

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 14 :** పొట్లమర్రి చెరువులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న జెసిబి, మూడు టాక్టర్లను సీజ్ చేసినట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు. విలేకరుల సమావేశంలో బుధవారం ఎస్సై సోమశేఖర్ మాట్లాడుతూ బత్తలపల్లి మండలం,పోట్లమర్రి గ్రామచెరువులో జెసిబి సాయంతో మట్టిని మూడు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నాయన్న సమాచారం రావడంతో తమ సిబ్బందితో వెళ్లి అక్కడ ఉన్న జెసిబి, మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి మండల మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

## అమరాపురం మండల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

### వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు గణేష్.. డైరెక్టర్ దాదాపీర్..





**అమరాపురం (తెలుగోడు), జనవరి 14 :** మండల ప్రజలకు రైతులకు, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, అపారస్తులకు, కార్మికులకు సంక్రాంతి పండుగ సందర్భంగా వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గణేష్ డైరెక్టర్ దాదా పీర్ శుభాకాంక్షలు తెలిపారు. భోగభాగ్యాలు ఇచ్చే భోగి, సరదాలు ఇచ్చే సంక్రాంతి కమ్మని, కనుమతో మండల ప్రజలకు నూతన సంవత్సరం లో కొత్త వెలుగులు నింపాలని వారు కోరారు.

## పల్లకిపై ఊరేగిన అయ్యప్ప స్వామి

**రొళ్ల (తెలుగోడు), జనవరి 14 :** మండలకేంద్రంలో బుధవారం అయ్యప్ప స్వామి ఉత్సవ మూర్తి ని పల్లకి పై ఉంచి పురవీధుల గుండా ఊరేగించారు. స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి ప్రత్యేకంగా అలకరించిన పల్లకిలో ఉత్సవ విగ్రహాన్ని పెట్టి మేళ తాళాలతో వాయిద్యాల నడుమ అయ్యప్ప మాల ధరించిన భక్తులు అయ్యప్ప స్వామి భక్తి పాటలను పాడుతూ ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా కొబ్బరి మొక్కను పంపానది ఒడ్డుపై నాటడం జరుగుతుందని అయ్యప్ప భక్తులు తెలిపారు.



పురవీధుల గుండా అయ్యప్ప స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

# సంప్రదాయాలు సంస్కృతికి నిలువెత్తు నిదర్శనం భోగి

### ముదిగుబ్బలో తుమ్మల మనోహర్ ఆధ్వర్యంలో ఘనంగా భోగి పండుగ.. గ్రామపంచాయతీ ముందు భోగి మంటలు..

**ముదిగుబ్బ (తెలుగోడు), జనవరి 14 :** ముదిగుబ్బలో భోగి పండుగను అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట టిడిపి క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్ నేతృత్వంలో భోగిమంటల కార్యక్రమాన్ని వైభవంగా ఏర్పాటు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన టిడిపి నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని భోగి పండుగను ఆనందంగా జరుపుకున్నారు. భోగిమంటలు వెలిగిస్తూ పాత అలవాట్లు, ప్రతికూల ఆలోచనలను విడిచిపెట్టి, నూతన ఆశయాలు, అభిలాషలతో జీవితంలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ పరస్పరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తుమ్మల మనోహర్ మాట్లాడుతూ... సంక్రాంతి పండుగకు ఉన్న ప్రత్యేకతను వివరించారు. తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలు తరతరాలుగా కొనసాగాలంటే ప్రతి ఒక్కరూ వాటి పరిరక్షణకు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. సంక్రాంతి వేడుకల్లో భాగంగా కోడిపందాలు, టగ్ ఆఫ్ వార్, కబడ్డీ వంటి సంప్రదాయ క్రీడలు నిర్వహించగా సంక్రాంతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యువత, పెద్దలు ఉత్సాహంగా పాల్గొనడంతో గ్రామమంతా పండుగ సందడితో కళకళలాడింది. భోగిమంటల వెలుగులతో పరిసర ప్రాంతం అంతా ఆహ్లాదకరమైన పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమం ఐక్యత, సోదరభావం, సామాజిక సమైక్యతకు ప్రతీకగా నిలిచిందని పాల్గొన్న నాయకులు అభిప్రాయపడ్డారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని భోగి పండుగను సంప్రదాయబద్ధంగా, ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకోవడం విశేషంగా నిలిచింది.



కబడ్డీ ఆడుతున్న దృశ్యం



టగ్ ఆఫ్ వార్ ఆడుతున్న దృశ్యం



సాంప్రదాయబద్ధంగా భోగి మంటలు వేసి కోడి పందాలు నిర్వహిస్తున్న దృశ్యం



వెంకటేశ్వర స్వామికి వెన్నతో ప్రత్యేక అలంకరణ చేసిన దృశ్యం

## వెంకటేశ్వర స్వామికి ఘనంగా వెన్న అలంకారం


**అగళి (తెలుగోడు), జనవరి 14 :** అగళిలో ప్రసిద్ధ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో బుధవారం ధనుర్మాసం ఆఖరు రోజు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శ్రీ వెంకటేశ్వర స్వామికి వెన్నతో ప్రత్యేక అలంకారం చేశారు. ఆర్యవైశ్యులు భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగానిర్వహించారు. ఈ దివ్య ఉత్సవానికి గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆలయ ప్రాంగణాన్ని భక్తి పరిమళాలతో నింపారు. ముందుగా తెల్లవారుజామున ఉత్సవ విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, అనంతరం వెన్నతో అలంకరించి సువాసన భరిత పుష్పాలు, రంగు రంగుల పూలహారాలతో సరికొత్తగా అలంకరించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య వేద పండితులు ప్రత్యేక పూజలు, ఆరాధనలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం దివ్య ధామంలా మారింది.

భక్తులకు పరమానందాన్ని కలిగించేలా గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి తిరుకల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించబడింది. ఈ తిరుకల్యాణ దర్శనం వల్ల కుటుంబ సౌఖ్యం, సంతాన ప్రాప్తి, ఐశ్వర్యాభివృద్ధి కలుగుతాయని శాస్త్రోక్త నమ్మకంతో పెద్ద ఎత్తున మహిళలు, గ్రామస్తులు పాల్గొని దర్శన భాగ్యాన్ని పొందారు. అయ్యప్ప స్వామి వారికి జ్యోతి భజన భక్తుల మనసులను విలాసంతో నింపింది. మహా మంగళహారతి నిర్వహించి, అనంతరం తీర్థ, అన్న ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ప్రసాద స్వీకరణతో భక్తులు అపార ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆర్యవైశ్య కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో భజనను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆలయ ప్రాంగణం జనసంద్రంగా మారింది. ఆధ్యాత్మిక శాంతి, సద్భావనలు వెల్లివిరిసాయని భక్తులు తెలిపారు. స్వామి వారి అనుగ్రహంతో గ్రామం సుఖసంతోషాలతో విలసిల్లాలని వారు ఆకాంక్షించారు.సంప్రదాయ బద్ధంగా,భక్తి పారవశ్యంతో నిర్వహించిన వెంకటేశ్వర స్వామి వెన్న అలంకారం తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

# ఆగళిలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

### టిడిపి రాష్ట ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి..

**అగళి (తెలుగోడు), జనవరి 14 :** ఆగళి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. మడకశిర నియోజకవర్గంలో మొట్టమొదటిసారిగా అగళి మండల కేంద్రంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు, కోళ్లకు కత్తులు కట్టకుండా కోళ్ల పందాలు, రైతులకు ఎద్దుల పోటీ నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను ఏర్పాటు చేసిన జడ్పిటిసి ఉమేష్, మండల టిడిపి నాయకులను అభినందించారు. సాంప్రదాయంగా వస్తున్న సంక్రాంతి పండుగలో ముగ్గుల పోటీలను నిర్వహించడం ఇప్పుడున్న యువతకు పరిచయం చేసి సాంప్రదాయ పద్ధతులను రాబోవు తరాలకు అందిపుచ్చుకునే విధంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే గుర్తుండి పోతాయన్నారు. సంక్రాంతి సంబరాల ఏర్పాట్ల కార్యక్రమంలో బాగవహించిన వారందరిని అభినందించారు. మండల ప్రజలకు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తరఫున భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, రాష్ట్ర కుంచిటిగ ఒక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, పార్లమెంటరీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసమూర్తి,జెడ్పిటిసి ఉమేష్,మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి, కన్వీనర్ తిప్పేస్వామి, సింగల్ విండో అధ్యక్షులు కుమారస్వామి, డైరెక్టర్ శివప్ప,ఎంపీపీ రేణుక కామరాజ్,నియోజకవర్గ కల్చరల్ సెల్ కార్యదర్శి రాజన్న, మండల కో క్లస్టర్ కమ్మరి శివన్న, మండల యూత్ ప్రెసిడెంట్ గోవిందరాజు, మాజీ ఎంపీపీలు నరసింహప్ప, బసవరాజు,మల్లేష్, మాజీ సర్పంచ్ నింగన్న, శివన్న, జయప్ప,తిమ్మరాజు,రమేష్, మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి



ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

## రంగురంగుల ముగ్గులతో మెరిసిన ఉన్నత పాఠశాల ప్రాంగణం

**అగళి (తెలుగోడు), జనవరి 14 :** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీలు కనువిందు చేశాయి. జడ్పిటిసి ఉమేష్ ఆధ్వర్యంలో మండల నాయకులు బుధవారం ఈ పోటీలను నిర్వహించారు .మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా మహిళలు రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలతో పాఠశాల ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. ఈ పోటీల్లో మండలంలోని మహిళలు మరియు యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు.గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా తీర్చిదిద్దిన ముగ్గులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ?అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు ప్రత్యేక బహుమతులను ఇవ్వడంతో పాటు పోటీలో పాల్గొన్న మహిళలందరికీ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి ఉమేష్ తదితర నాయకులు మాట్లాడుతూ పండుగ సంప్రదాయాలను నేటి తరానికి అందించడంలో ఇటువంటి పోటీలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. మహిళల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సంప్రదాయం ఉట్టిపడేలా ముగ్గువేసి పూలు నవధాన్యాలు వేసి పూజ నిర్వహిస్తున్న మహిళ



ముగ్గులు వేయడంలో నిమగ్నమైన మహిళలు

# ముదిగుబ్బలో ఘనంగా గోదా రంగనాథ స్వామి తిరుకల్యాణోత్సవం

### దివ్య మంత్రోచ్ఛారణలు.. భక్తజన సమ్మేళనంగా ఆలయ ప్రాంగణం.. ఆలయ ప్రాంగణంలో వైకుంఠ వైభవం.. గోదా రంగనాథ స్వామి దివ్య దర్శనం ..

**ముదిగుబ్బ (తెలుగోడు), జనవరి 14 :** ముదిగుబ్బలోని ప్రసిద్ధ శ్రీ సూర్యచంద్ర అభయాంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం శ్రీ గోదా రంగనాథ స్వామి తిరుకల్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ దివ్య ఉత్సవానికి గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆలయ ప్రాంగణాన్ని భక్తి పరిమళాలతో నింపారు. ఉత్సవానికి ముందుగా తెల్లవారుజామున ఉత్సవ విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, అనంతరం సువాసన పుష్పాలు, రంగురంగుల పూలహారాలతో సరికొత్తగా అలంకరించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య వేద పండితులు తిరుచానూరు రంగాచార్యుల బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ఆరాధనలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం దివ్యధామంలా మారింది.

భక్తులకు పరమానందాన్ని కలిగించేలా గోదాదేవి సమేత రంగనాథ స్వామి తిరుకల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించబడింది. ఈ తిరుకల్యాణ దర్శనం వల్ల కుటుంబ సౌఖ్యం, సంతాన ప్రాప్తి, ఐశ్వర్యాభివృద్ధి కలుగుతాయని శాస్త్రోక్త నమ్మకంతో పెద్ద ఎత్తున మహిళలు, గ్రామస్తులు పాల్గొని దర్శన భాగ్యాన్ని పొందారు. దివ్య మాంగళ్య ధ్వనులు, మంగళ వాయిద్యాల మధ్య జరిగిన కళ్యాణోత్సవం భక్తుల మనసులను హరివిలాసంతో నింపింది.

తిరుకల్యాణానంతరం మహా మంగళహారతి నిర్వహించి, అనంతరం తీర్థ, అన్న ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ప్రసాద స్వీకరణతో భక్తులు అపార ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆలయ ప్రాంగణం జనసంద్రంగా మారింది. ఈ దివ్య తిరుకల్యాణోత్సవం ద్వారా గ్రామంలో ఆధ్యాత్మిక శాంతి, సద్భావనలు వెల్లివిరిసాయని భక్తులు తెలిపారు. దేవతా అనుగ్రహంతో గ్రామం సుఖసంతోషాలతో విలసిల్లాలని వారు ఆకాంక్షించారు. సంప్రదాయబద్ధంగా, భక్తి పరవశతతో నిర్వహించిన ఈ గోదా రంగనాథ స్వామి తిరుకల్యాణోత్సవం భక్తుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది.



పండితులు తిరుచానూరు రంగాచార్యులు



శ్రీ గోదాదేవి లక్ష్మీదేవి రంగనాథ స్వాముల ఉత్సవ విగ్రహాలు విశేష పూజలు అందుకుంటున్న శ్రీ సూర్యచంద్ర అభయాంజనేయ స్వామి

# మిన్నంటిన భోగి సంబరాలు

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 14 :** తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి సంబరాలు బత్తలపల్లి మండలం లో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. పండుగలో మొదటి రోజైన భోగిని పురస్కరించుకొని బుధవారం తెల్లవారుజామున నుంచే గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. యువత పెద్దలు ఉత్సాహంగా వీధివీధిన ఇంటి ముంగిట భోగి మంటలు వేశారు. పాత వస్తువులు మంటల్లో, చలిని సైతం లెక్కచేయకుండా మంటల చెట్టు ప్రదక్షిణాలు చేస్తూ సందడి చేశారు. బత్తలపల్లి లోని శ్రీ ఓంకారేశ్వర ఆలయం వద్ద శివదీక్షపరులు ప్రత్యేకంగా భోగి మంటలు వేసి ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపారు. ప్రతి ఇంట్లో చిన్నారులకు దృష్టి తగలకుండా భోగి పళ్ళు పోశారు. రేగి పళ్ళు, బంతిపూల రెక్కలు, చిల్లర నాణీలు, చెరుకు ముక్కలను కలిపి చిన్నారుల తలపై పోసి ఆశీర్వదించారు. బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలిలో సంక్రాంతి సందడి కోలాహారంగా సాగింది. కొత్త బట్టలు, పూలు, పండ్లు, పండుగ సామగ్రి కొనుగోలుతో కూడలి ప్రాంతమంతా జనంతో కిటికీటలాడింది. వ్యాపారులు జోరుగా సాగడంతో పట్టణంలో పండుగ కళా సంతరించుకుంది. పండుగ సాకుతో అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని,గ్రామాల్లో కోడి పందేలు, జూదాల నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేశారు.



ఓ ఇంటి వద్ద భోగి మంట వేసిన దృశ్యం



పిల్లలకు భోగి పళ్లు పోస్తున్న దృశ్యం



హైదరాబాద్‌లో మంద కృష్ణ మాదిగను కలిసిన ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు

# 8న హాల్విలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

**హాజరుకానున్న మందకృష్ణ..**

**కౌతాళం (తెలుగోడు), జనవరి 14 :**
కౌతాళం మండలం హాల్వి గ్రామంలో ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఫిబ్రవరి 8వ తేదీ నిర్వహిస్తున్నట్లు అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ హాజరవుతారన్నారు. ఈ మేరకు హైదరాబాదులో మందకృష్ణ మాదిగను కలిసి విగ్రహావిష్కరణకు హాజరుకావలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో హాల్వి, గుడికంబాలి గ్రామస్తులు , మంత్రాలయం నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ కో ఇన్చార్జ్ ముగతి ప్రతాప్ కుమార్ మాదిగ, కౌతాళం మండలం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఆనంద్ మాదిగ, ప్రదాన కార్యదర్శి రామాంజినేయులు మాదిగ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌతాలం మండలం నాయకులు సురేష్ మాదిగ , కమిటీ పెద్దలు మరియు నిర్వాహకులు దేవపుత్ర మాదిగ తదితరులు పాల్గొన్నారు



భోగి మంటలతో సంబరాలు చేసుకుంటున్న దృశ్యం

# భోగి పండుగ ప్రతి ఇంట ఆనందాన్ని నింపాలి

**టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి ..**

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 14 :**
భోగి పండుగ ప్రతి ఇంట ఆనందాన్ని నింపాలని టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి ఆకాంక్షించారు. బుధవారం పెద్దకడబూరు మండలంలోని వివిధ గ్రామాలలో భోగి పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. పెద్దకడబూరులో నరవ రమాకాంతరెడ్డి కుటుంబ సభ్యులు భోగి పండుగ సందర్భంగా సంప్రదాయ భోగి మంటలు వేసి, ఆకట్టుకునే రంగు రంగుల భోగి ముగ్గులతో పండుగ వైభవాన్ని చాటారు. ఈ సందర్భంగా టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి మాట్లాడుతూ పెద్దకడబూరు మండల ప్రజలకు భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. భోగి పండుగ విశిష్టతను వివరిస్తూ భోగి రోజున చిన్నారుల తలపై భోగి పండ్లు పోయడం వల్ల చెడు దృష్టి తొలగి, జ్ఞానం, ఆయుష్షు పెరుగుతాయని పెద్దలు విశ్వసిస్తారని తెలిపారు. దక్షిణాయనంలో ఎదురైన కష్టాలు, బాధలను భోగి మంటల్లో ఆహుతి చేసి, రాబోయే ఉత్తరాయణంలో ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు, ఆరోగ్యం, శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. ఈ భోగి పండుగ ప్రతి ఇంటా ఆనందాన్ని, కొత్త ఆశలను నింపాలని కోరుకుంటూ ప్రజలందరికీ భోగి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో మురళీధర్ రెడ్డి, నరవ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



తుంగభద్ర ఎస్ఈ నారాయణను కలిసిన టిడిపి తెలుగుదేశం రైతు సంఘం జిల్లా అధికారి ప్రతినిధి సాయిబాబా

# జనవరి చివరి వరకు ఎల్ఎల్‌సికి నీరు అందించాలి

**టిడిపి తెలుగు రైతు సంఘం జిల్లా అధికార ప్రతినిధి సాయిబాబు..**

**కౌతాళం (తెలుగోడు), జనవరి 14 :**
తుంగభద్రా దిగువ కాల్వకు జనవరి నెల చివరి వరకు సాగునీరు అందించాలని సాగులో ఉన్న మిరప పంటను కాపాడాలని టిడిపి తెలుగు రైతు సంఘం జిల్లా అధికార ప్రతినిధి సాయిబాబు కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ మేరకు తుంగభద్ర బోర్డు కార్యదర్శి, ఎస్ఈ నారాయణ నాయక్‌ను కలిసి ప్రత్యేకంగా విన్నవించామన్నారు. దిగువ కాల్వకు కింద సుమారు 25 వేల ఎకరాల దాకా మిరప పంట రభీ సీజన్ కాను సాగు చేసి ఉన్నారని రైతులు సాగుచేసిన పంట పూత దశలో ఉందని ఈ సమయంలో నీరు అందకపోతే రైతులకు పూర్తిగా నష్టం వస్తుందని వివరించారు . కనీసం రైతులు పెట్టిన పెట్టుబడి రావాలంటే ఈనెల జనవరి చివరి వరకు సాగునీరు అందించాలని కోరారు. అలాగే తుంగభద్ర డ్యాం గేట్ల ఏర్పాటుపై కూడా అధికారులను విచారించినట్లు తెలిపారు అలాగే తాను స్వయంగా అధికారులతో కలిసి పనులను పరిశీలించినట్లు వివరించారు. గేట్ల పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఏప్రిల్ చివరి నాటికి పూర్తి చేస్తామని అధికారులు పేర్కొంటున్నారని తెలిపారు.

# జర్నలిస్టుల అరెస్టు దారుణం

**వైఎస్ జగన్ ఖండన ..**

**తాడేపల్లి (తెలుగోడు), జనవరి 14 :**
జర్నలిస్టుల అరెస్టును వైఎస్ జగన్ తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టులను ఉగ్రవాదుల్లా అరెస్ట్ చేయడం అత్యంత దారుణమని ఆయన విమర్శించారు. జర్నలిస్టుల పట్ల అమానుషంగా ప్రవర్తించారని, ఈ చర్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. అరెస్టుల సమయంలో కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేశారని జగన్ ఆరోపించారు. జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని, మీడియా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని గుర్తుచేసిన ఆయన, మీడియాను అణిచివేసే ప్రయత్నాలను ప్రజలు సహించరని హెచ్చరించారు.

# ఎన్టీవీ జర్నలిస్టుల అరెస్టుపై రాహుల్ గాంధీకి కేటీఆర్ ట్వీట్

**హైదరాబాద్ (తెలుగోడు), జనవరి 14 :**
ఎన్టీవీ జర్నలిస్టుల అరెస్టు వ్యవహారంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ట్యాగ్ చేస్తూ ట్వీట్ చేశారు. "రాహుల్ జీ! ఇక్కడ మీ 'మొహబ్బత్ కీ దుకాణ నిర్వాకమిదీ. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పౌరులను, జర్నలిస్టులను ఇలా తొక్కుతోంది" అంటూ కేటీఆర్ విమర్శించారు. జర్నలిస్టుల ఇళ్ల తలుపులు బద్దలు కొట్టి అరెస్టులు చేయడం దారుణమని అన్నారు. రాష్ట్ర పోలీసులు కిడ్నాపర్లలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బెయిలబుల్ సెక్షన్లు ఉన్న కేసులో ఇంత అతి ఎందుకని ప్రశ్నించిన కేటీఆర్, దీచీూా సెక్షన్ 35 కింద నోటీసులు ఇవ్వకుండా అరెస్టులు చేయడమేంటని నిలదీశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతులను అణిచివేయడం తగదని పేర్కొన్నారు.

# మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలి

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 14 :**
మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలంటూ బుధవారం పెద్దకడబూరు గ్రామంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సీపీఐ ఆధ్వర్యంలో జీఓ ప్రతులను భోగి మంటల్లో దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు . ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మబ్బు ఆంజనేయ, బీకేఎంయు మండల కార్యదర్శి కుమ్మరి చంద్ర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్చడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో నియంత పాలన చేస్తుందని ఆరోపించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానాన్ని రద్దు చేసి, ప్రభుత్వమే మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నెల 18న ఖమ్మంలో జరిగే శత వసంతాల వేడుకలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిపిఐ మండల సహాయ కార్యదర్శి తిక్కన్న, నాయకులు డోలు హనుమంతు, నాగరాజు, వీరేష్, చాకలి లక్ష్మన్న, సురేష్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి వీరేష్



భోగి మంటల్లో జీవో ప్రతులను వేసి దగ్ధం చేస్తున్న సీపీఐ నాయకులు



ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ మాచాని శివ శంకర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

# ఎమ్మిగనూరు జాతరలో అక్రమ వసూళ్లు అవాస్తవం

**ఎమ్మిగనూరు (తెలుగోడు), జనవరి 14 :**
ఎమ్మిగనూరులో శ్రీ నీలకంటేశ్వర స్వామి జాతర సందర్భంగా అక్రమ వసూళ్లు చేస్తున్నారన్న వర్తకుల ఆరోపణలు వాస్తవం కాదని ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ మాచాని శివ శంకర్ అన్నారు. మాచాని శివ శంకర్ పుట్టినరోజు సందర్భంగా వర్తకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేరు మేటిదారులకు 2012 నుండి నాలుగు సార్లు పెంచారన్నారు. జాతర వైభవం ఎక్కడ తగ్గించకుండా సొంత డబ్బులతో నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. ఇందులో ఎండోమెంట్ ఈవో ప్రమేయం ఉండదన్నారు.

# సంక్రాంతి సందర్భంగా ముగ్గులు, ఆటల పోటీలు

**కౌతాళం (తెలుగోడు), జనవరి 14 :**
కౌతాళంలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు పురస్కరించుకొని ఏకల్ గ్రామోత్తన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ముగ్గుల పోటీలలో మొదటి బహుమతి వద్దే రేణుక, రెండవ బహుమతి కె జె. హర్షిత, 3వ బహుమతి జి. నీరజ, నాల్గవ బహుమతి జి.పూజ, ఐదవ బహుమతి టీ.మేఘన గెలుచుకున్నారు. మ్యూజికల్ చైర్స్ పోటీల్లో విజేతగా సి .పూజిత, రన్నర్‌గా ఆర్‌సి లక్ష్మి గెలిచారు. పరుగు పందెం పోటీలో మొదటి బహుమతి వద్దే పూజిత, రెండవ బహుమతి టీ.ఈరమ్మ, నిమ్మకాయ, స్పూన్ పోటీలో మొదటి బహుమతి టీ.ఈరమ్మ, రెండవ బహుమతి సి. పూజిత గెలుచుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కౌతాళం టీడీపీ టౌన్ అధ్యక్షులు డాక్టర్ నీలి రాజానంద్, అధ్యక్షులు కె మారుతి మోహన్ , టీడీపీ తెలుగు యువత నేత గొట్టయ్య, సుగురప్ప దేని, ముకన్న, కమిటీ సభ్యులు శశి కుమార్ దేని, గురురాజా గౌడ, ఈడిగ శివ, ఎన్ నాగరత్న మేడం ఆర్గనైజింగ్ సెక్రటరీ , కృష్ణ చైతన్య, కోఆర్డినేటర్ వద్దే పరమేష్, ట్రైనర్ శారద పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వక్తలు



మాట్లాడుతున్న రైతు బోయ.మద్దిలేటి

# లైన్‌మెన్ కృష్ణకాంత్‌పై తప్పుడు ప్రచారం

**ఎమ్మిగనూరు (తెలుగోడు), జనవరి 14 :**
ఎమ్మిగనూరు మండలం కడివెళ్ళ గ్రామంలో పనిచేస్తున్న లైన్‌మెన్ కృష్ణకాంత్‌పై తప్పుడు ప్రచారం జరిగిందని కడివెళ్ళ రైతు బోయ.మద్దిలేటి అన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంఘాల నాయకులతో కలిసి లైన్‌మెన్ కృష్ణకాంత్‌పై తప్పుడు ఆరోపణలు చేసి, తప్పుడు వార్తలు పెట్టించినందుకు మన్నించాలని అన్నారు. కృష్ణకాంత్ తమలాంటి రైతులకు చాలా సహాయం చేశారన్నారు. కృష్ణకాంత్ గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరికీ సహాయ, సహకారాలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో కడివెళ్ళ హనుమంతు, గుడికల్. హనుమప్ప, రాగిమన్ దొడ్డి. కిష్టప్ప, లైన్‌మెన్ సీ. లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం



గ్రామోత్సవంలో విన్యాసాలు చేస్తున్న కళాకారులు . ఉత్సవమూర్తులకు పూజులు చేస్తున్న అర్చక స్వాములు

# కైలాస వాహనంపై శివపార్వతులు

**శ్రీశైలం (తెలుగోడు), జనవరి 14 :**
శ్రీశైలం మహా క్షేత్రంలో నిర్వహిస్తున్న సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నాడు స్వామి అమ్మవారు కైలాస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల ప్రత్యేక పూజలు అనంతరం సాయంకాలం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక పూలతో నూతన వస్త్రాలతో అలంకరింపజేయించి అర్చక స్వాములు సంప్రదాయబద్ధంగా అలంకరణ పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ పూజలు నిర్వహించి స్వామి అమ్మవార్లను గ్రామోత్సవానికి తోడ్కొని వచ్చారు. గ్రామోత్సవం శ్రీశైల పురవీధుల్లో ఎంతో వైభవంగా ముందుకు సాగింది. విద్యుత్ దీపకాంతులు నడుమ భేరీనాదాలు, డప్పు వాయిద్యాలు, కళాకారుల విన్యాసాల నడుమ గ్రామోత్సవం వైభవంగా ముందుకు సాగింది. ఈ గ్రామోత్సవంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎం శ్రీనివాసరావు దంపతులు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చక వేద పండితులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### సంప్రదాయబద్ధంగా భోగి మంటలు

శ్రీశైలం మహా క్షేత్రంలో సంస్కృతి సంప్రదాయ పరిరక్షణలో భాగంగా దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం ఉదయం వేకువజామున "భోగిమంటలు" కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన ఆలయ మహాద్వారం ఎదురుగా గంగాధర మండపం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమములో దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఎ.వి. రమణ, ప్రత్యేక ఆహ్వానితులు ఎ. శ్రీనివాసులు, శ్రీస్వామివారి ప్రధానార్చకులు హెచ్. వీరయ్యస్వామి, పలువురు అర్చకస్వాములు, సిబ్బంది పాల్గొన్నారు. ముందుగా అర్చకస్వాములు, వేదపండితులు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు . సంప్రదాయబద్ధంగా పిడకలు, ఎండుగడ్డి, వంటచెరుకు వేసి "భోగిమంటలు" వేశారు. సంక్రాంతి సందర్భంగా వేసే భోగిమంటలకు మన సంప్రదాయంలో ఎంతో విశిష్టత ఉంది. భోగిమంటలు వేయడం వల్ల దుష్టపీడలు విరగడై, అమంగళాలు తొలగి సకలశుభాలు కలుగుతాయని ప్రతీతి. మన సంస్కృతి సంప్రదాయాలపై అందరికీ మరింత అవగాహన కల్పించాలనే భావనతో ఏటా దేవస్థానం ఆధ్వర్యంలో భోగిమంటల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కార్య నిర్వహణ అధికారి ఎం. శ్రీనివాసరావు తెలిపారు.



స్వామి అమ్మవార్ల గ్రామోత్సవంలో పాల్గొన్న అధికారులు, భక్తులు



శ్రీశైలంలో భోగి మంటలు వేస్తున్న అధికారులు, అర్చకులు

## ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్రాంతి శుభాకాంక్షలు

**అమరావతి (తెలుగోడు), జనవరి 14 :**
సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే పవిత్ర పర్వదినం "మకర సంక్రాంతి" సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు. విశిష్టమైన ఈ సంక్రాంతి పండుగ మీ జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. పాడిపంటలతో పల్లె సీమలు మరింత కళకళలాడాలని, ఆధునికతను సంతరించుకున్నప్పటికీ, మన సంప్రదాయాలను మరచిపోకుండా పాటించాలని కోరుకుంటున్నాను. ఈ సంక్రాంతి పండుగ సందర్భంగా రైతన్నలు ఆనందంగా ఉండాలని, కష్టజీవులు శ్రమకు తగిన ఫలితం పొందాలని, అందుకు అనువైన పథకాలతో ప్రభుత్వం మరింత బాధ్యతతో వ్యవహరిస్తుందని హామీ ఇస్తున్నాను. సంక్రాంతి పండుగ ఆనందంగా జరుపుకోవాలని కోరుకుంటున్నామన్నారు.

## కబడ్డీ పోటీల్లో గుడిపాడు జట్టు జయకేతనం

**దువ్వూరు (తెలుగోడు), జనవరి 14 :**
సంక్రాంతి పండుగ సంబరాల్లో భాగంగా దువ్వూరు మండలం గుడిపాడు గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి. గ్రామంలోని కొత్త రామాలయం ప్రాంగణంలో మంగళ, బుధవారాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో మండల వ్యాప్తంగా మొత్తం 13 జట్లు తలపడ్డాయి. రెండు రోజుల పాటు సాగిన ఈ పోటీల్లో క్రీడాకారులు అద్భుత ప్రతిభను కనబరిచారు. ఫైనల్ పోటీలో గుడిపాడు సూర్య జట్టు ప్రథమ స్థానంలో నిలిచి విజేతగా నిలిచింది. అలాగే మచనపల్లె జట్టు ద్వితీయ స్థానాన్ని, గుడిపాడు రఫీ జట్టు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాయని నిర్వహణ కమిటీ సభ్యులు వెల్లడించారు. విజేతగా నిలిచిన జట్లకు నిర్వాహకులు ప్రథమ బహుమతిగా 10,000, ద్వితీయ బహుమతిగా 6,000, తృతీయ బహుమతిగా 3,000 అందజేశారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు సంక్రాంతి వేళ ఇటువంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమని స్థానికులు కొనియాడారు. ఈ


కబడ్డీ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందచేస్తున్న కమిటీ సభ్యులు

కార్యక్రమంలో కమిటీ సభ్యులు, క్రీడాకారులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


భోగి మంటలు వేస్తున్న డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు

## ప్రభుత్వ భూగర్భ జల జలగణన శాఖ సంచాలకులుగా కొంపెల్ల సుబ్బరాయ శాస్త్రి

**విజయవాడ (తెలుగోడు), జనవరి 14 :**
ప్రభుత్వ భూగర్భ జల మరియు జలగణన శాఖ సంచాలకులుగా కొంపెల్ల సుబ్బరాయ శాస్త్రి విజయవాడ హనుమాన్ పేటలోని భూగర్భ జలశాఖ సంచాలకుల కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథరిటీ(కాడా)లో జాయింట్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్న ఆయనను భూగర్భ జలశాఖ సంచాలకులుగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఆయన భూగర్భ జలశాఖ సంచాలకులుగా బాధ్యతలు చేపట్టారు. భూగర్భ జలాల అంచనా, వర్గీకరణ, మయాంకనం రంగాలలో ఆయనకు 34 సంవత్సరాలకు పైగా అనుభవం ఉంది. 1991లో అసిస్టెంట్ హైడ్రోజియాలజిస్ట్‌గా సేవలు ప్రారంభించిన ఆయన, అనంతరం అసిస్టెంట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొందుతూ శాఖలో వివిధ హోదాల్లో, రాష్ట్రం లోని పలు ప్రాంతాల్లో విశేషంగా భూగర్భ జలశాఖ లో సేవలు అందించారు. భూగర్భ జలాలపై చేపట్టిన అనేక ప్రాజెక్టులు, ఫీల్డ్ సర్వేలు, ఆధునిక డేటా సాంకేతికత వినియోగంలో ఆయన కీలక పాత్ర పోషించారు. రాష్ట్రవ్యాప్తంగా నీటి వనరుల సంరక్షణ, సమర్థ వినియోగానికి ఆయన సేవలు ఎంతో ఉపయోగపడ్డాయి. ఐ.ఐ.టి. రూర్కీ నుంచి ఇంజనీరింగ్ లో మాస్టర్ డిగ్రీ విశ్వవిద్యాలయ గోల్డ్ మెడల్ సాధించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ చేశారు. ఆ శాఖ అధికారులు, సిబ్బంది ఆయనను అభినందించారు.



## మాజీ ఎంపీపీ మునిరాజా రెడ్డితో ఎంపీ అవినాష్ రెడ్డి భేటీ

**ముద్దనూరు (తెలుగోడు), జనవరి 14 :**
మాజీ ఎంపీపీ ఐనిరాజా రెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డితో వైయస్సార్ పార్టీ కడప ఎంపీ అవినాష్ రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. పార్టీని క్షేత్రస్థాయి నుండి బలోపేతం చేయడానికి కృషి చేసేందుకు సహకరించాలని కోరారు. అనంతరం తిమ్మాపురం గ్రామంలోని వైసీపీ మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి శ్రీధర్ రెడ్డి ఇంటికి వెళ్ళి, వారిని వారిని పరామర్శించి కుటుంబ సభ్యులతో,


ఎంపీ అవినాష్ రెడ్డితో వైసిపి మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి


మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డితో ఎంపీ అవినాష్ రెడ్డి

చుట్టుపక్కల నుండి వచ్చిన, వైసిపి నాయకులతో కార్యకర్తలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అలాగే వివిధ గ్రామాల నుండి వచ్చిన వైసీపీ నాయకులు కార్యకర్తలు, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వైసిపి నియోజవర్గ ఇంచార్జి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఎస్ ఇ సి మెంబర్ గిరిధర్ రెడ్డి. శివారెడ్డి, తదితరులతోపాటు ప్రస్తుత ఎంపీపీ పుష్పలత, కో ఆప్షన్ నెంబర్ కదిరి భాష, వైసిపి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా భోగి పండుగ

### డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు..



**దువ్వూరు (తెలుగోడు), జనవరి 14 :**
బద్వేల్ నియోజకవర్గంలో ఘనంగా భోగి పండుగ వేడుక సంబరాల్లో ప్రజలు పాల్గొన్నారు. తెల్లవారుజామునే భోగి మంటలు వేసి ప్రజలు ఆనందంతో పండుగ జరుపుకున్నారు. ఇక, ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి భోగి పండుగ సంబరాలు చేసుకున్నారు. బద్వేల్ నియోజకవర్గ ప్రజలందరికీ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ భోగభాగ్యాలు, ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో అభివృద్ధి చెందాలని మంచూరు సూర్యనారాయణ రెడ్డి కోరారు.


భోగి మంటలు వేస్తుపకప బద్వేల్ నియోజకవర్గం వైకాపా సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి కుటుంబ సభ్యులు

## సోషల్ మీడియా ముసుగులో హనీ ట్రాప్

# దంపతుల అరెస్ట్

### వంద మందికి పైగా బాధితులు .. నగ్న వీడియోలతో బ్లాక్ మెయిల్ చేస్తున్న భార్యాభర్తల బాగోతం బట్టబయలు..

**కరీంనగర్ రూరల్ (తెలుగోడు), జనవరి 14 :**
సోషల్ మీడియా వేదికగా అమాయకులను, వ్యాపారవేత్తలను ఆకర్షించి, వారితో ఏకాంతంగా గడిపిన దృశ్యాలను రికార్డు చేసి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న కిలాడీ దంపతులను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. మంచిర్యాల జిల్లాకు చెందిన దంపతులు గత కొంతకాలంగా కరీంనగర్ రూరల్ పరిధిలోని ఆరేపల్లి 'శ్రీ సాయి నివాస' అపార్ట్మెంట్లో నివాసం ఉంటున్నారు. భార్య తన ఇన్స్టాగ్రామ్ ఖాతాలో ఆకర్షణీయమైన ఫోటోలు పెడుతూ యువకులను, వ్యాపారస్తులను ప్రలోభపెట్టేది. ఆమెను సంప్రదించిన వారితో డబ్బులు మాట్లాడుకుని తన నివాసానికి పిలిపించుకునేది. వారు ఏకాంతంగా ఉన్న సమయంలో, భర్త రహస్యంగా మొబైల్ ఫోన్లలో నగ్న వీడియోలను చిత్రీకరించేవాడు.

లక్షల్లో వసూళ్లు – విలాసవంతమైన జీవితం

ఈ వీడియోలను చూపిస్తూ బాధితులను భయపెట్టి సదరు దంపతులు భారీగా డబ్బులు వసూలు చేసేవారు. ఈ అక్రమ సంపాదనతో వారు అపార్ట్మెంట్ ఈఎంఐలు కట్టడమే కాకుండా, టాటా కారును కొనుగోలు చేశారు. తమ ఇంట్లో ఖరీదైన సోఫా సెట్లు, ఏసీలు ఏర్పాటు చేసుకుని విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నారు. ఇప్పటివరకు సుమారు 100 మందిని వీరు ట్రాప్ చేసినట్లు సమాచారం.

కరీంనగర్‌కు చెందిన ఒక వ్యక్తి గత ఏడాది కాలంగా వీరి వద్దకు వెళుతున్నాడు. అతని వద్ద నుండి ఇప్పటికే సుమారు 14 లక్షల రూపాయలను వసూలు చేసిన దంపతులు, అదనంగా మరో 5 లక్షల రూపాయలు ఇవ్వాలని, లేదంటే వీడియోలు వైరల్ చేసి చంపేస్తామని బెదిరించారు. ప్రాణభయంతో బాధితుడు కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటపడింది.

ఏసీపీ విజయ్ కుమార్ ఆదేశాల మేరకు సిఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో రెండు బృందాలు గాలింపు చేపట్టాయి. ఉదయం 8 గంటల సమయంలో టేస్టీ దాబా వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి నేరానికి ఉపయోగించిన కారు, నగ్న వీడియోలు ఉన్న మొబైల్ ఫోన్లు బాధితుడి నుండి తీసుకున్న చెక్ లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారించగా వారు నేరాన్ని ఒప్పుకున్నారని, మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి 14 రోజుల రిమాండ్ కు తరలించామని పోలీసులు తెలిపారు. 24 గంటల్లోనే కేసును ఛేదించిన సిబ్బందిని ఏసీపీ విజయ్ కుమార్ అభినందించారు. సోషల్ మీడియాలో పరిచయం లేని వ్యక్తుల ట్రాప్‌లో పడకూడదని, ఎవరైనా ఇలాంటి వేధింపులకు గురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని అధికారులు కోరారు.

## భోగి పండుగ శుభాకాంక్షలు

### బద్వేల్ నియోజకవర్గం వైకాపా సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి

**బద్వేల్ (తెలుగోడు), జనవరి 14 :**
భోగి పండుగ సందర్భంగా బద్వేల్ నియోజకవర్గం అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి తమ నివాసం వద్ద నిర్వహించిన భోగి మంట కార్యక్రమంలో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాత కష్టాలను భోగి మంటలో సమర్పించి, కొత్త ఆశలు, కొత్త విజయాలతో ప్రతి ఇంటా ఆనందం, ఆరోగ్యం, శుభశాంతులు వెల్లివిరియాలని బద్వేల్ నియోజకవర్గ ప్రజలందరికీ హృదయపూర్వక భోగి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రైతన్నకు మంచి పంటలు, యువతకు ఉత్తమ భవిష్యత్, ప్రతి కుటుంబానికి సుఖసంతోషాలు కలగాలని కోరుకున్నారు.



## తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

### ఎంపీ కేశినేని శివశ్రీనాథ్ ..

**విజయవాడ (తెలుగోడు), జనవరి 14 :**
తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండుగ ప్రతి ఇంట్లో ఆనందం, ఐక్యత, సుఖసంతోషాలు నింపాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఆకాంక్షించారు. .సంక్రాంతి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితంలో నూతన ఆశలు, ఆశయాలు, సానుకూల మార్పులు తీసుకురావాలన్నారు. ప్రత్యేకంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సంక్రాంతి పండుగ ఎంతో ప్రాముఖ్యత కలిగినదని, రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎంపీ కేశినేని పేర్కొన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు పేదలు, రైతులు, మహిళలు, యువతకు మేలు చేస్తున్నాయని తెలిపారు. వ్యవసాయ రంగం, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాల కల్పన, విద్య, ఆరోగ్యం వంటి కీలక రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న చర్యల వల్ల రాష్ట్రం వేగంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. ఈ సంక్రాంతి పర్వదినాల్లో ప్రజలందరూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సంప్రదాయ పద్ధతిలో ఆనందంగా వేడుకలు జరుపుకోవాలని, ప్రతి ఇంట్లో సుఖశాంతులు, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఎంపీ కేశినేని శివనాథ్ ఆకాంక్షించారు. విజయవాడ పార్లమెంటు నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధించే దిశగా ప్రజల సహకారం ఎప్పటికీ అవసరమని ఆయన తెలిపారు.



# ఘనంగా భోగి పండుగ

### అమరాపురంలో సంక్రాంతి శోభ..

**అమరాపురం (తెలుగోడు), జనవరి 14 :**
సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా బుధవారం భోగి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యువతీ, యువకులు గ్రామంలో వ్యక్తపదార్థాల లో భోగి మంటలను వేసుకున్నారు. అదేవిధంగా ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. భోగి పండుగ మనలో చెడును తరిమికొట్టి మంచిని ప్రసాదిస్తాయని సంక్రాంతి పండుగ జరుపుకుంటున్నాం అందరి ఇండ్ల వద్ద భోగభాగ్యాలు, సిరులు కురిపించాలని ప్రార్థించారు. అదేవిధంగా మండల కేంద్రమైన అమరాపురం లో చెరుకు, అనుపకాయలు, గేనస గడ్డలు, ముగ్గుల పిండి, ముగ్గు రంగులను ప్రజలు కొనుగోలు చేశారు. జోరుగా అమ్మకాలు జరిగాయి. చుట్టుపక్కల గ్రామీణ ప్రజలు అధికంగా రావడంతో సంక్రాంతి శోభ సంతరించుకుంది. అదేవిధంగా పూలకు పండుగ సందర్భంగా విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. నేడు మకర సంక్రాంతి. మండలంలో గురువారం రెండవ రోజు మకర సంక్రాంతి పండుగను ఆచరించడానికి ప్రజలు సిద్ధమైనారు. తమ తమ ఇంటి వద్ద శుభ్రం చేసుకుని ఇంటి ముందు వివిధ రంగులతో ముగ్గులు వేయడానికి మహిళలు సర్వం సిద్ధం చేసుకున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా వివిధ దేవాలయాల వద్ద మహిళలు ముగ్గులు చేయడానికి సిద్ధమయ్యారు.


సంక్రాంతి ముగ్గులు వేస్తున్న మహిళలు



సంక్రాంతి ముగ్గు వేస్తున్న వైష్ణవి



అమరాపురంలో పూల మండి వద్ద పూలు కొనడానికి తరలివచ్చిన ప్రజలు. చెరుకు, అనపకాయలు గేనస గడ్డలు కొనడానికి తరలివచ్చిన గ్రామీణ ప్రజలు


గురివిరెడ్డికి నివాళులు అర్పిస్తున్న బద్వేల్ వైకాపా సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి

## గురివిరెడ్డికి నివాళులు

### బద్వేల్ వైకాపా సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి ..

**బద్వేల్ (తెలుగోడు), జనవరి 14 :**
కలసపాడు మండలం ముద్దంవారి పల్లె గ్రామానికి చెందిన అంకన నారపురెడ్డి కుమారుడు గురివిరెడ్డి అనారోగ్య కారణాలతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బద్వేల్ నియోజకవర్గం వైకాపా అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి గురివిరెడ్డి మృతదేహంపై పుష్పగుచ్ఛంఉంచి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.


గురివిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బద్వేల్ వైకాపా సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి

## తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు

**హైదరాబాద్ (తెలుగోడు), జనవరి 14 :**
తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు ప్రభుత్వం జనాభా ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేసింది. 121 మున్సిపాలిటీల్లో జనరల్ 30, జనరల్ మహిళ 31, బీసీ జనరల్ 19, బీసీ మహిళ 19, ఎస్సీ జనరల్ 9, ాజ మహిళ 8, ఎస్టీ జనరల్ 3, ా మహిళలకు 2 స్థానాలు కేటాయించింది. 10 కార్పొరేషన్లలో జనరల్ 1, జనరల్ మహిళ 4, బీసీ జనరల్ 2, బీసీ మహిళ 1, ఎస్సీ 1, ఎస్టీకి ఒక స్థానంలో కేటాయింపులు చేసింది.



## నీట్-2025 పీజీ వైద్య విద్యలో ప్రవేశాలకు అర్హత ప్రమాణాలు కుదింపు

**న్యూఢిల్లీ, జనవరి 14:**
నీట్-2025 పీజీ వైద్య విద్యలో ప్రవేశాలకు అర్హత శాతాలను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) సవరించింది. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు 40శాతం నుంచి సున్నా శాతానికి, జనరల్ కేటగిరీకి 50శాతం నుంచి 7 శాతానికి తగ్గించింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 18వేలకు పైగా మెడికల్ పీజీ సీట్లు ఖాళీగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. రెండు రౌండ్ల కౌన్సెలింగ్ పూర్తయిన అనంతరం ఎన్‌బీఈఎంఎస్ ఈ నిర్ణయం తీసుకుంది. దేశంలో శిక్షణ పొందిన వైద్య నిపుణుల సంఖ్యను భారీగా పెంచడంతో పాటు అందుబాటులో ఉన్న సీట్లను గరిష్ఠంగా ఉపయోగించుకొనే లక్ష్యంతోనే ఈ సవరణ చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

## ఆర్టీసీ బస్సు బోల్తా

**గుమ్మలక్ష్మీపురం, జనవరి 14:**
గుమ్మలక్ష్మీపురం మండలం మండ గ్రామంలో వంతెనను ఢీ కొన్ని ఓ ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. అయితే ఇందులో ప్రయాణికులెవరూ లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్, కండక్టర్‌కు మాత్రం స్వల్ప గాయాలయ్యాయి. వారు కురుపాం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. కాగా రోజూలానే బుధవారం సాయంత్రం పార్వతీపురం డిపో నుంచి బయల్దేరిన ఈ బస్సు రాత్రి ఏడున్నరకి గుమ్మలక్ష్మీపురం చేరుకుంది. 7:45 గంటలకు తిరుగు ప్రయాణమైంది. సుమారు ఐదు కిలోమీటర్లు సాఫీగానే వెళ్లిన బస్సు మండ గ్రామ సమీపంలో అదుపుతప్పింది. వంతెనను ఢీ కొని బోల్తా పడింది. ఆ వంతెన కింద మండ గెడ్డ ప్రవహిస్తుండగా ఏ మాత్రం బస్సు కింద పడినా సుమారు 20 అడుగుల లోతుకు చేరుకునేది. వంతెనకు మధ్యలోనే బస్సు బోల్తా పడి ఉండడంతో భారీ ప్రమాదం తప్పింది. దీనిపై డ్రైవర్‌ను వివరణ కోరగా..
'బస్సులో ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది.. ఆ తర్వాత స్టీరింగ్ అదుపు తప్పడంతో ఈ ప్రమాదం జరిగింది.' అని తెలిపారు. ఈ ప్రమాదం కారణంగా పార్వతీపురం-గుమ్మలక్ష్మీపురం మధ్య భారీ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎల్విన్‌పేట పోలీసులు అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వంతెన మధ్య బోల్తా పడిన బస్సును తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి

**మేడ్చల్ టౌన్, జనవరి 14:**
ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారిపై గాజులమ్మ ఆలయం వద్ద అటవీ శాఖ నిర్లక్ష్యానికి జింక బలైంది. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన జింక, సుమారు రెండు గంటల పాటు ప్రాణాలతో విలవిలలాడింది. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించినా, అధికారులు స్పందించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రమాద స్థలానికి చేరుకోవడంలో నిర్లక్ష్యం చూపిన ఫారెస్ట్ అధికారులు, చివరకు జింక ప్రాణాలు పోయే వరకు చర్యలు తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. సమయానికి ఫారెస్ట్ అధికారులు స్పందించి ఉంటే జింక ప్రాణాలు నిలిచేవి అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణ రక్షణ బాధ్యత వహించాల్సిన అటవీ శాఖ అధికారుల అలసత్వం కారణంగా మరో వన్యప్రాణి ప్రాణం పోవడం దురదృష్టకరమని వారు మండిపడుతున్నారు.

## 600కి పైగా వీధి కుక్కలు హతం

**మాచారెడ్డి, జనవరి 14 :**
కామారెడ్డి జిల్లా మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలను చంపిన ఘటన తీవ్ర కలకలం రేపింది. పాల్వంచ మండల కేంద్రంతో పాటు ఫరీద్పేట్, బండరామేశ్వర్‌పల్లి, భవానీపేట, వాడి గ్రామాల్లో 600కి పైగా వీధి కుక్కలను చంపేశారు. ఇటీవల ఎన్నికైన నూతన సర్పంచ్ల ఆధ్వర్యంలో ఈ చర్య జరిగినట్టు పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. ఇంజెక్షన్లు, గుళికలు ఇవ్వడంతో 600కు పైగా కుక్కలు చనిపోయాయి. ఈ ఘటనపై జంతు హక్కుల కార్యకర్తలు మూల రజని, ఎనుప్రోలు అనిత, భాను ప్రకాశ్, గోవర్ధన్, గౌతమ్ తదితరులు మాచారెడ్డి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఐదుగురు సర్పంచులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కుక్కలను పాతిపెట్టిన ప్రాంతాలను గుర్తించి తవ్వితీసి వాటి కళేబరాలతో పంచనామా నిర్వహించారు. కుక్కలు మృత్యువాత పడటానికి కారకులైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జంతు ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.



## బాంబులా పేలిన చిప్స్ ప్యాకెట్
### కంటిచూపు కోల్పోయిన చిన్నారి..

**బలాంగీర్, జనవరి 14 :**
పిల్లలు ఎంతో ఇష్టంగా తినే చిప్స్ ప్యాకెట్ ఓ 8 ఏళ్ల బాలుడి జీవితంలో చీకట్లు నింపింది. చిప్స్ ప్యాకెట్ ఒక్కసారిగా పేలడంతో ఆ చిన్నారి కంటిచూపును శాశ్వతంగా కోల్పోయిన విషాదకర ఘటన ఒడిశాలోని బలాంగీర్ జిల్లా టిట్లాగఢ్ ప్రాంతంలో చోటుచేసుకుంది. టిట్లాగఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాగర్ ఘాట్ గ్రామానికి చెందిన లబ్ హర్పాల్ కుమారుడు సోమవారం సాయంత్రం ట్యూషన్ నుంచి తిరిగి వస్తూ దారిలో ఓ షాపులో చిప్స్ ప్యాకెట్ కొనుక్కున్నాడు. ఇంటికి వచ్చిన తర్వాత ఆ ప్యాకెట్ తిందామని వంటగదిలోకి వెళ్లాడు. ఆ సమయంలో అతని తల్లి భానుమతి హర్పాల్ గ్యాస్ స్టవ్ మీద వంట చేస్తోంది. ఆమె నీళ్ల కోసం బయటకు వెళ్లిన ఆ కొద్ది క్షణాల్లోనే ఈ ఘోరం జరిగిపోయింది.
బాలుడి చేతిలో ఉన్న చిప్స్ ప్యాకెట్ ప్రమాదవశాత్తు జారి మండుతున్న గ్యాస్ స్టవ్‌పై పడింది. వేడి తగలగానే ఆ ప్యాకెట్ ఒక్కసారిగా బాంబులా భారీ శబ్దంతో పేలిపోయింది. ఈ పేలుడు తీవ్రత నేరుగా బాలుడి ముఖంపై పడటంతో అతని కన్ను తీవ్రంగా దెబ్బతిని రక్తమోడింది. బాలుడి అరుపులు విని తల్లి పరుగెత్తుకుంటూ వచ్చేసరికి చిన్నారి రక్తపు మడుగులో కనిపించాడు.



## మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు

**తాడిపత్రి (తెలుగోడు), జనవరి 14 :**
సంక్రాంతి సంబరాల్లో భాగంగా మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో తాడిపత్రి పట్టణంలోని కాలువగడ్డ వీధిలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులు మాట్లాడుతూ మత్సకార సంక్షేమ సమితి రాష్ట్రవ్యాప్తంగా ఏడు అంశాలపై నిరంతరం పనిచస్తోందన్నారు. అందులో భాగంగా భక్తికి సంబంధించిన సంక్రాంతి సంబరాలు నిర్వహించిందన్నారు. మహిళలు మన హిందూ సాంప్రదాయ పద్ధతులు పండుగలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని అన్నారు. కుటుంబ వ్యవస్థను రక్షించాల్సిన బాధ్యత మహిళలు తమ భుజాన వేసుకొని కుటుంబ వ్యవస్థను మహిళామణులు కాపాడుతున్నారని అన్నారు. సంప్రదాయాలను పాటించడంతో మహిళా మూర్తులు ముందు వరుసలో ఉంటారని తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకార సంక్షేమ సమితి విద్య, వైద్యం, భక్తి, క్రీడలు, స్వయం ఉపాధి, మహిళా ఆర్థిక స్థలంబన, సురక్ష , పర్యావరణం తదితర అంశాలపై నిరంతరం పనిచేస్తోందని తెలియజేశారు. ఏప్రిల్ 8, 9 తేదీల్లో శ్రీశైలంలో జరుగు రాష్ట్ర సర్వసభ్య సమావేశానికి సంప్రదాయ మత్స్యకారులైన బెస్త కులస్తులందరూ తప్పకుండా హాజరుకావాలన్నారు. మహిళలు ఓనం చీరలు పురుషులు తెల్లచొక్కా, తెల్ల పంచ ధరించి రావాలన్నారు. న్యాయ నిర్ణేతగా రిటైర్డ్ హెడ్మాస్టర్ జింకా నారాయణస్వామి వ్యవహరించారు.


ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న మత్స్యకార సంక్షేమ సమితి నాయకులు

అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నారాయణ మూర్తి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలసుబ్రమణ్యం, కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం, జిల్లా గౌరవ అధ్యక్షులు పిల్లి రవీంద్ర, జిల్లా అధ్యక్షులు జొన్నల పవన్ కుమార్, మహిళా ఉపాధ్యక్షులు మల్లీశ్వరి, జిల్లా కార్యదర్శులు మల్లికార్జున, రవి, ఆయా బస్తీలలోని మహిళలు పాల్గొన్నారు.


ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న మత్స్యకార సంక్షేమ సమితి నాయకులు

## బైకర్ ప్రాణాలు తీసిన మాంజా దారం

**హైదరాబాద్, జనవరి 14 :**
మాంజా దారాలు కోసుకుపోతూ.. జనాల ప్రాణాలమీదకు వస్తున్నాయి. కొన్నిరోజులుగా వాహనదారుల పీకల మీదకు వస్తున్నాయి చైనా మాంజా దారాలు.. చైనా మాంజాను వాడొద్దు అని పోలీసులు పదేపదే చెబుతున్నా, వివిధ షాపుల పై దాడులు చేస్తూ.. కేసులు పెడుతున్నా కూడా కొందరిలో మార్పు మాత్రం రావడం లేదు.. ఈ మంజాను వాడడం వల్ల ఎంతో మంది గాయాలపాలు అవ్వడమే కాకుండా.. మరి కొంతమంది మృత్యువాత పడుతున్నారు. మొత్తంగా సంక్రాంతి పండుగ వేళ ఈ మాంజా దారం వల్ల కొన్ని కుటుంబాల్లో తీరని శోకం మిగులుతుంది.
తాజాగా సంగారెడ్డి జిల్లా పరిధిలో ఓ ఘటన అందరిని కలిచి వేసింది. సంగారెడ్డి మండలం ఫసల్వాది గ్రామంలో చైనా మంజా మెడకు కోసుకుపోయి ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. మృతుడు బీహార్ కు చెందిన అద్వైక్ గా గుర్తించారు పోలీసులు.. బైక్ పై సంగారెడ్డి సైడ్ వస్తుండగా తెగిన మాంజా దారం అతని గొంతు వద్ద కోసుకుపోయింది. బైక్ స్పీడ్‌గా ఉన్న నేపథ్యంలో గాయం పెద్దగా అయి తీవ్ర రక్తస్రావం జరిగి మృతి చెందాడు.. కాగా అద్వైక్ పసల్వాది లో ఓ పరిశ్రమలో పని చేస్తున్నాడు.. అతనిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారౌ ఇలా మాంజా దారం వల్ల ప్రమాదాలు జరుగుతూ మృతి చెందిన కూడా కొంతమంది ఇంకా వాటిని వాడుతూనే ఉండటం ఆందోళన కలిగిస్తోంది.
పతంగుల పండగ నేపథ్యంలో చాలా చోట్ల పంతంగులు ఎగురవేస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. అయితే వారంరోజులుగా చూస్తున్న ఘటనలు మనసులను కలచివేస్తున్నాయి. చాలా మంది చైనా మాంజాలతో అల్లాడిపోతున్నారు. చైనా మాంజా దారాలు కోసుకుపోతూ.. జనాల ప్రాణాలమీదకు వస్తున్నాయి.. మొన్న ఓ బైకర్ చేయి తీసేసినంత పనైంది. ఉప్పల్‌లో మెడకు చుట్టుకోవడంతో ఆయన గొంతు కట్ అయింది. అల్మాస్‌గూడలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలి కాలికి చుట్టుకోవడంతో తీవ్ర గాయమైంది. 70శాతం కాలు తెగిపోయింది. ఇటీవల గచ్చిబౌలిలో చైనా మాంజాతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి హాస్పిటల్



పాలయ్యాడు. ఇలా వరుస ఘటనలు సామాన్యులను.. ముఖ్యంగా వాహనదారులను కలవరపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇకనైనా చైనా మాంజా ఉపయోగించకుండా మారాలంటూ పోలీసులు సూచిస్తున్నారు.

## రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

**వరంగల్, జనవరి 14 :**
రైలు ప్రయాణంలో ప్రమాదవశాత్తు జారిపడి భారత సైన్యంలో సుబేదార్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి మృతి చెందిన విషాదకర ఘటన వరంగల్ జిల్లాలో చోటుచేసుకుంది. వరంగల్ జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రానికి చెందిన సంతోష్ కుమార్ (48) పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఇండియన్ ఆర్మీ సుబేదార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 12వ తేదీన ఆయన న్యూఢిల్లీ నుంచి చెన్నై వెళ్లే అండమాన్ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నెం. 16032)లో ప్రయాణిస్తున్నారు. అదే రోజు రాత్రి 10:40 గంటల సమయంలో రైలు కేసముద్రం ఇంటికన్నె రైల్వే స్టేషన్ల మధ్యకు రాగానే సంతోష్ కుమార్ ప్రమాదవశాత్తు రైలు నుండి కిందకు జారిపడ్డారు. ఈ ప్రమాదంలోఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. రైల్వే అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు వరంగల్ రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## 10 శాతం సెస్ వసూలు

**అమరావతి (తెలుగోడు), జనవరి 14 :**
రహదారి ప్రమాదాల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సొంత వాహనాల లైఫ్ ట్యాక్స్కు అదనంగా 10 శాతం రహదారి భద్రతా సెస్ వసూలు చేసేందుకు ఆర్డినెన్స్ జారీ చేసింది. 'ఏపీ మోటార్ వాహన పన్ను చట్టం-1963' సవరణకు మంత్రివర్గం, గవర్నర్ ఆమోదం లభించింది. దీని ప్రకారం, ఇకపై వాహనం కొనుగోలు చేసే సమయంలో లైఫ్ ట్యాక్స్ పాటు ఈ సెస్ కూడా చెల్లించాల్సి ఉంటుంది. ఈ సెస్ ద్వారా సేకరించిన నిధులను రోడ్ల మరమ్మతులు, బ్లాక్ స్పాట్ను తొలగించడానికి వినియోగించనున్నారు.

## జర్నలిస్టుల అరెస్టుకు ఖండన
### ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్..

**హైదరాబాద్ (తెలుగోడు), జనవరి 14 :**
చీఎఏఇన్ పుట్ ఎడిటర్ దొంతు రమేష్ తోపాటు, ఇతర జర్నలిస్ట్ ల అక్రమ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ నాయక్ బాదావత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ భీముడు నాయక్ లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్ట్ లను, తీవ్రవాదుల, దేశద్రోహుల ల్లాగా రాత్రికి.. రాత్రి ఇండ్ల మీద పడి అరెస్ట్ చేయడం, ప్రయాణంలో ఉన్నవారిని కనీసం ఎక్కడున్నారో కూడా తెలియకుండా పట్టుకోవడం, పండుగ వేళ అని కూడా చూడకుండా ఆ కుటుంబాలలో తీవ్ర మనస్థాపానికి గురి చేశారన్నారు. తప్పు జరిగిందని భావిస్తే చట్ట పరంగా చర్యలు చేపట్టాలి.. ముందస్తు నోటీసులు అందజేసి..కోర్ట్ లో హాజరు పరచాలని, ఈ రకంగా అక్రమ అరెస్టులు చేయడం తగదని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


**హైదరాబాద్, జనవరి 14 :**
కీసర ఔటర్ రింగ్ రోడ్ సర్వీస్ రోడ్డులోని స్పీడ్ బ్రేకర్ వద్ద బుధవారం రాత్రి ద్విచక్రవాహనం స్కిడ్ అయి యువకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. కీసర సీఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. బోగారం గ్రామానికి చెందిన గడ్డం కుమార్ (23) కుషాయిగూడలోని ఒక ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న సమయంలో కీసర ఔటర్ రింగ్ రోడ్ సర్వీస్ రోడ్డులో ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద ప్రమాదం జరిగింది. స్పీడ్ బ్రేకర్ ప్రాంతంలో సరైన వెలుతురు లేకపోవడంతో గ్లామర్ బైక్ అదుపుతప్పి స్కిడ్ అయి కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో కుమార్‌కు తలకు తీవ్రమైన గాయం కావడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న కీసర సీఐ ఆంజనేయులు, ఎస్ఐ లక్ష్మణ్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కీసర పోలీసులు తెలిపారు.



## వీధివీధినా సంక్రాంతి రంగవల్లులు

### పస్పుటంగా కనిపించిన ఆదోని జిల్లా డిమాండ్ ..

**ఆదోని (తెలుగోడు), జనవరి 14 :**
ఈసారి సంక్రాంతి రంగవల్లుల్లో ఆదోని జిల్లా డిమాండ్ ప్రస్ఫుటంగా కనిపించింది. భోగి సందర్భంగా బుధవారం ఆదోని డివిజన్లో మహిళలు తమ ఇళ్ల ముంగిట వీధులలో వాసిన ముగ్గులు, రంగవల్లులలో ఆదోని జిల్లా చేయాలి అని రాయడం ప్రత్యేకత సంతరించుకుంది. ఉపాధ్యాయులు జగదీష్ సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటాన్ని రంగవల్లుల్లో చిత్రీకరించడం అందరినీ ఆకర్షించింది. ఆదోని పట్టణంలోని ప్రతి వీధిలో, ఐదు నియోజకవర్గాల్లో ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలని ముగ్గులతో రాయడం వెనుక మహిళల కోరిక వెల్లడైనట్టింది. ఆదోని వెంకన్నపేటలో ఆంజనేయస్వామి దేవాలయ సమీపంలో బోడ శారద రంగవల్లుల్లో పూర్ణకుంభాలను వేయడం ఆకర్షించింది. నాగమణి రూపాదేవి గ్రూపు మహిళలు చక్కని ముగ్గులు వేశారు . దారిన పోయే వారందరినీ ఈ ముగ్గులు ఎంతగానో ఆకర్షించాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆదోని జిల్లా చేయాలని నిర్ణయం తీసుకోవాలని ఉపాధ్యాయులు జగదీష్, సామాజిక విశ్లేషకులు డాక్టర్ జి నల్లారెడ్డి నూర్ అహమ్మద్, కృష్ణమూర్తి, రఘురామయ్య, దస్తగిరి నాయుడు కోరారు.





ఆదోని పట్టణంలోని ఇళ్ల ముంగిట వేసిన సంక్రాంతి ముగ్గుల్లో ఆదోని జిల్లా కావాలని రాసిన దృశ్యం


ఆదోని పట్టణంలోని ఇళ్ల ముంగిట వేసిన సంక్రాంతి ముగ్గుల్లో ఆదోని జిల్లా కావాలని రాసిన దృశ్యం



# అసలైన పండుగలా మా సినిమా



అనగనగా ఒకరాజుపై నవీన్ పోలిశెట్టి 'సంక్రాంతి' పండుగలోని ఎనర్జీ అంతా 'అనగనగా ఒక రాజు' సినిమాలో ఉంటుంది. ఒత్తిడిని దూరం చేసి, హాయిగా నవ్వించే సినిమా ఇది. ఫ్యామిలీ అంతా హాయిగా కలిసి చూసే పర్‌ఫెక్ట్ పండుగ సినిమా అనమాట. బుకింగ్స్ చాలా బావున్నాయి. మిమ్మల్ని తప్పకుండా అలరించే సినిమా అవుతుంది.' అని హీరో నవీన్ పొలిశెట్టి చెప్పారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'అనగనగా ఒక రాజు'. మీనాక్షి చౌదరి కథానాయిక. మారి దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. ఈ నెల 14న సంక్రాంతి కానుకగా సినిమా విడుదల అయ్యింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో జరిగిన సినిమా ప్రీరిలీజ్ ప్రెస్‌మీట్‌లో నవీన్ పొలిశెట్టి మాట్లాడారు. తామంతా ఇష్టంతో కష్టపడి చేసిన సినిమా ఇదని, సినిమా చూస్తున్నంతసేపూ నవ్వుతూనే ఉంటారనీ, మీ స్పందన కోసం ఎదురుచూస్తున్నామని కథానాయిక మీనాక్షి చౌదరి అన్నారు. బాధలన్నింటినీ మరపించి, రెండున్నర గంటలపాటు హాయిగా నవ్వించే పర్‌ఫెక్ట్ సంక్రాంతి చిత్రమిదని డైరెక్టర్ మారి నమ్మకంగా చెప్పారు. 'ఇదో గోదావరి నేపథ్యంతో కూడిన అందమైన కథ. నవీన్ శైలిలో సరదాగా ఉంటుంది. సినిమా ఎంత నవ్విస్తుందో, చివర్లో అంత ఎమోషన్‌కి గురిచేస్తుంది. ఈ గ్రామీణ చిత్రంలో చిన్న పొలిటికల్ సెటైర్ కూడా ఉంటుంది. అన్ని అంశాలతో కూడిన అసలైన పండుగ సినిమా ఇది.' అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ పేర్కొన్నారు. ఇంకా బాలనటుడు రేవంత్ కూడా మాట్లాడారు.

# నేనెందుకు క్షమాపణ చెప్పాలి.. మలైకా అరోరా



ఐటమ్ సాంగ్స్‌తోనే ప్రత్యేక క్రేజ్ సొంతం చేసుకున్నారు నటి మలైకా అరోరా. ఆమె చేసిన కొన్ని పాటలు సినిమాకే హైలైట్‌గా నిలిచాయి. గతేడాది కూడా రెండు పాటల్లో మలైకా మెరిశారు. కొందరు ఆమెను ఈ విషయంలో ట్రోల్ చేయగా.. తాజాగా ఆమె స్పందించారు. ఆ పాటల వల్ల తనకు శక్తి వస్తుందని తెలిపారు. తాను చేసిన ఐటమ్ సాంగ్స్ విషయంలో ఎవరికీ క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదన్నారు.
'నేను డ్యాన్స్ చేయడం ఎందుకు తగ్గించాలి. ఆ విషయంలో క్షమాపణలు ఎందుకు చెప్పాలి. ట్రోల్స్ ఎప్పుడూ వస్తూనే ఉంటాయి. డ్యాన్స్ చేయడం గొప్ప విషయం. అదో కళ. నిజమైన గౌరవంతో దాన్ని ఆస్వాదించాలి. 52 ఏళ్ల వయసులో నేను ఇలాంటి పాటల్లో హుషారుగా డ్యాన్స్ చేయగలుగుతున్నానంటే అది నా అదృష్టం. నేను సరైన మార్గంలోనే ప్రయాణిస్తున్నాను. ఇలాంటి పాటలతో అలరించడం నాకు చాలా శక్తినిస్తుంది. నన్ను చూసి మరికొందరు మహిళలు ఇలా హుషారుగా ఉంటే నాకు దానికి మించిన ఆనందం మరొకటి ఉండదు' అని మలైకా అన్నారు. 'ఛల్ ఛయ్య ఛయ్య ఛయ్య'.. 'మున్నీ బద్నామ్ హుయీ'.. నుంచి 'అనార్కలీ డిస్కో చాలి' వరకూ ఎన్నో పాటల్లో మలైకా తన కిర్రాక్ డ్యాన్స్‌తో అభిమానులను అలరించారు. గతేడాది కూడా హనీ సింగ్‌తో కలిసి 'చిల్‌గమ్', ఆదిత్య సర్పోదర్ దర్శకత్వంలో వచ్చిన 'థామా'లో రష్మికతో కలిసి పాయిజన్ బేబీతో ఆకట్టుకున్నారు.

# పీపుల్ మీడియా ఫ్యాక్టరీ విశ్వప్రసాద్‌తో పవన్ భేటీ



తదుపరి ప్రాజెక్ట్ కోసమే అన్న ఊహాగానాలు

సంక్రాంతి పండుగ వేళ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ అందింది. భోగి పండుగ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని, సరికొత్త ఆరంభాలకు నాంది పలుకుతూ పవన్ కళ్యాణ్ తన భవిష్యత్తు చిత్రాలపై దృష్టి సారించినట్లు సమాచారం. ఇందులో భాగంగానే ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టి.జి. విశ్వప్రసాద్‌తో పవన్ కళ్యాణ్ ఈరోజు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గతంలో వీరి మధ్య జరిగిన ప్రాథమిక చర్చలను ముందుకు తీసుకెళ్లే క్రమంలో రాబోయే భారీ ప్రాజెక్టుల గురించి ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్' భాగస్వామ్యంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించబోయే చిత్రాలకు సంబంధించి ఈ చర్చలు జరిగినట్లు సమాచారం. రాజకీయ బాధ్యతలతో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, తన కోసం ఎదురుచూస్తున్న నిర్మాతలు, అభిమానుల కోసం తన సినీ కమిట్‌మెంట్లను వేగవంతం చేయాలని పవన్ భావిస్తున్నారు. ఈ భేటీతో పవన్ కళ్యాణ్ నెక్ట్స్ లైన్-అప్‌పై స్పష్టత రావడంతో మెగా ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి మరిన్ని వివరాలు త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.

Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.